PRAJASAKTI Regd.No. 15795/68

# ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 138 | విజయవాడ, సోమవారం 19 డిసెంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 19 December 2022 | Rs

### కోరలు చాచిన నిరుద్యోగం

- 'రోజ్‌గార్ పేరిట మోడీ సర్కార్ ప్రచారార్భాటాలు
- డిసెంబర్ 16 నాటికి 9.3 శాతం నిరుద్యోగ రేటు
- సిఎంఐఇ నివేదికలో వెల్లడి

• లోపలి పేజీలో.. •




**పెనాల్టీ షూటౌట్ ఇలా..**

| అర్జెంటీనా | | ఫ్రాన్స్ | |
|---|---|---|---|
| మెస్సి | 1 | ఎంబపే | 1 |
| పాలో డోబెల్లా | 1 | కింగ్స్‌ల్లే | × |
| పెరడెస్ | 1 | చౌమెని | × |
| మోంటెల్ | 1 | కోలో మౌని | 1 |

# ప్రపంచ విజేత అర్జెంటీనా

సాకర్ మహా సంగ్రామం ముగిసింది. హోరాహోరీగా పెనాల్టీషూటవుట్ వరకు సాగిన మ్యాచ్‌లో అర్జెంటీనా విజేతగా నిలిచింది. ముచ్చటగా మూడోసారి ఫిఫా ప్రపంచ కప్పును ముద్దాడింది. డిపెండింగ్ ఛాంపియన్ ఫ్రాన్స్ రన్నరప్‌గా నిలిచింది. పెనాల్టీషూటవుట్‌లో అర్జెంటీనా 4 గోల్స్ సాధించగా ఫ్రాన్స్ 2 గోల్స్‌కే పరిమితమైంది. చివరి నిమిషంలో అర్జెంటీనా ఆటగాడు మోంటెల్ ఆడిన బంతి ఫ్రాన్స్ గోల్‌కీపర్‌ను మాయ చేసి పోస్ట్‌లోకి దూసుకెళ్లింది. అంతే అర్జెంటీనా క్రీడాకారుల, అభిమానుల ఆనందానికి అంతు లేకుండా పోయింది. ఫైనల్ మ్యాచ్ జరిగిన లూసైల్ స్టేడియం మైదానం వారి హర్షధ్వానాలతో మారుమ్రోగింది. గెలుపు ఖాయంగానే మైదానంలోకి దూసుకొచ్చారు. క్రీడాకారులతో కలిసి సంబరాల్లో మునిగిపోయారు. మరోవైపు తుదివరకు ఫ్రాన్స్ అభిమానులు నైరాశ్యంలో మునిగిపోయారు.


గోల్డెన్ బూట్ విజేత ఫ్రాన్స్ ఆటగాడు ఎంబపే

## నేవీ అమ్ములపొదిలో ఐఎన్ఎస్ మోర్ముగావ్



**ముంబయి :** భారత నావికా దళం అమ్ములపొదిలోకి మరో శక్తిమంతమైన యుద్ధ నౌక చేరింది. రహస్య సంకేత మార్గదర్శనంలో లక్షిత క్షిపణులను విధ్వంసం చేయగల అత్యంత శక్తిమంతమైన 'ఐఎన్ఎస్ మోర్ముగావ్' యుద్ధ నౌకను ఆదివారం నాడు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నావికా దళంలోకి ప్రవేశపెట్టారు. ఇండియన్ నేవీ వార్‌షిప్ డిజైన్ బ్యూరో (ఐఎన్‌డబ్ల్యుఎస్‌డిబి) రూపొందించిన ఈ యుద్ధనౌకను మఝుగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండిఎస్ఎల్) సంస్థ పూర్తిస్థాయిలో దేశీయంగా నిర్మించడం విశేషం. రహస్య సంకేత మార్గదర్శక క్షిపణి విధ్వంసకాల్లో 'విశాఖపట్నం' శ్రేణి (పి 15బి స్టెల్త్ గైడెడ్ క్షిపణి విధ్వంస యుద్ధనౌకలు)కి చెందిన నాలుగింటిలో ఐఎన్ఎస్ మోర్ముగావ్ రెండోవది. ముంబయిలో నిర్వహించిన జలప్రవేశ కార్యక్రమంలో గోవా గవర్నరు పిఎస్ శ్రీధరన్ పిళ్లై, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, సైన్యాధిపతి (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్, నావికా దళ అధిపతి అడ్మిరల్ ఆర్ హరికుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ దేశీయంగానే కాకుండా ప్రపంచ నౌకా నిర్మాణ అవసరాలను సైతం భారత్ తీర్చగలదన్న విశ్వాసాన్ని రాజ్‌నాథ్ వ్యక్తం చేశారు. దేశ రక్షణోత్పత్తి సామర్థ్యానికి గీటురాయి అయిన ఐఎన్ఎస్ మోర్ముగావ్ నౌకలోని వ్యవస్థలు భవిష్యత్తు అవసరాలు తీర్చగలని తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రు

## స్ఫూర్తి ప్రదాత జస్టిస్ చిన్నపరెడ్డి

- నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలి
- శతజయంతి సభలో జస్టిస్ చంద్రు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

న్యాయ వ్యవస్థలో పనిచేసే వారెవరికైనా జస్టిస్ చిన్నపరెడ్డి స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని తమిళనాడు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రు పేర్కొన్నారు. జస్టిస్ చిన్నపరెడ్డి శతజయంతిని పురస్కరించుకొని 'రాజ్యాంగ విలువలు-చిన్నపరెడ్డి తీర్పులు' అన్న అంశంపై అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఆదివారం సదస్సు జరిగింది. తొలుత చిన్నపరెడ్డి చిత్రపటానికి జస్టిస్ చంద్రు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రముఖ న్యాయవాది గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ చిన్నపరెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా అనేక తీర్పులిచ్చారన్నారు. అందులో ప్రధానంగా నాలుగు అతి ముఖ్యమైనవిగా చెప్పుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం మతమార్పిడుల విషయంలో పెద్దఎత్తున చర్చలు సాగుతున్న తరుణంలో ఆ తీర్పును ఉటంకించుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. అరవిందో కేసులో మత విశ్వాసాలపై ఒక కేసు ఆయన ముందుకొచ్చినప్పుడు ఇచ్చిన తీర్పు ఇప్పటి పరిస్థితులకు సరిగ్గా మిగతా 2లో

## 20 పోర్టులకు
# రూ. 8,244 కోట్ల రుణం

**• ఐఐఎఫ్‌సిఎల్ ప్రకటన • జాబితాలో రామాయపట్నం, భావనపాడు • బందరు పోర్టుకు 1,000 కోట్లు ?**

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ రంగ సంస్థ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఐఐఎఫ్‌సిఎల్) దేశ వ్యాప్తంగా 20 పోర్టులకు 8.244 కోట్ల రూపాయలను రుణంగా ఇవ్వాలని నిర్ణయించింది. ఈ జాబితాలో రాష్ట్రానికి చెందిన మూడు పోర్టులు ఉన్నాయి. రామాయపట్నం, భావనపాడు పోర్టులతో పాటు మరో గ్రీన్‌ఫీల్డ్ నాన్‌మేజర్ పోర్టు ఉన్నట్లు ఐఐఎఫ్‌సిఎల్ వర్గాలు తెలిపాయి. మూడో పోర్టుపేరును ఆ వర్గాలు వెల్లడించకపోయినప్పటికీ బందరుపోర్టుగా భావిస్తున్నారు. జనవరి లేదా ఫిబ్రవరి నెలల్లో ఈ పోర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తొలిదశను 30నెలల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. 'సంవత్సరానికి 30 మిలియను టన్నుల సామర్థ్యం (ఎంటిపిఎ)తో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు 1,000 కోట్ల రూపాయల రుణం మంజూరైంది' అని ఆ వర్గాలు తెలిపాయి. బందరు పోర్టు తొలివిడత ప్రతిపాదిత సామర్థ్యం కూడా 30 ఎంటిపిఎ కావడం గమనార్హం. అయితే, ఈ పోర్టుకు సంబంధించిన వివాదం కోర్టులో ఉన్న సంగతి తెలిసిందే. ఈ కారణంగానే పోర్టు పేరును గోప్యంగా ఉంచిఉంటారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రామాయపట్నం, భావనపాడు పోర్టులకు ఎంత మొత్తం రుణం మంజూరైందన్న విషయాన్ని కూడా ఐఐఎఫ్‌సిఎల్ వర్గాలు తెలపలేదు. రాష్ట్రంలో ఇప్పటికే వైజాగ్ పోర్టులోని ఎస్సార్ టెర్మినల్‌కు, కృష్ణపట్నం పోర్టుకు ఐఐఎఫ్‌సిఎల్ రుణం ఇచ్చింది.

**2023 చివరికి రామాయపట్నం**

రామాయపట్నం పోర్టు 2023 చివరికి అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. ఆ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు పోర్టులోని నాలుగు బెర్తుల పనులు పూర్తికానున్నాయి. 34 ఎంటిపిఎ సామర్థ్యంతో ఈ పోర్టు కార్యకలాపాలు ప్రారంభిస్తుందని సమాచారం. రామాయపట్నం పోర్టు అందుబాటులోకి వస్తే దక్షిణాది రాష్ట్రాల్లో కనెక్టివిటి పెరగడంతోపాటు, రవాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందని ఐఐఎఫ్‌సిఎల్ ఎండి పి.ఆర్ జైశంకర్ పాత్రికేయులకు చెప్పారు. రాష్ట్రంలో చేపట్టిన భావనపాడుతో పాటు మరో ప్రాజెక్టుకు కూడా అంతే ప్రాధాన్యత ఉందని ఆయన అన్నారు. రానున్న కొద్ది సంవత్సరాలలో ఈ రెండు ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని, అప్పుడు దేశీయ కార్గో సామర్థ్యం కూడా గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అన్ని పోర్టులకు కలిపి 2,600 ఎంటిపిఎ కార్గో సామర్థ్యం ఉంది. వీటిలో 12 మేజర్ పోర్టుల సామర్థ్యం 1,598 ఎంటిపిఎ. ప్రస్తుతం ఐఐఎఫ్‌సిఎల్ రుణం అందిస్తున్న అన్ని పోర్టులు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే మరో 1,000 ఎంటిపిఎ మేర కార్గో సామర్థ్యం పెరుగుతుందని అంచనా.

## సిపిఎస్ వద్దు.. ఒపిఎస్ ముద్దు

- ఇచ్చిన హామీని సిఎం నెరవేర్చాలి : ఎమ్మెల్సీలు
- జనవరిలో ఉద్యమం ఉధృతం : నక్కా వెంకటేశ్వర్లు
- యుటిఎఫ్ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో 4,5కె వాక్



గుంటూరులో 4కె వాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

**ప్రజాశక్తి - యంత్రాంగం**

కార్పొరేట్లకు మాత్రమే లాభాన్ని చేకూర్చే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో 4, 5కె వాక్ నిర్వహించారు. సిపిఎస్, జిపిఎస్ వద్దు... ఒపిఎస్ అమలు చేయాలని ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని సిఎం అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో పిఎస్ఎన్ఎం హైస్కూలు నుంచి ఏడు రోడ్ల కూడలి, డేఅండ్‌నైట్ కూడలి మీదుగా తిరిగి ఆ స్కూల్ వద్దకు 5కె వాక్ నిర్వహించారు. పెద్దసంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరావు మాట్లాడుతూ..సిపిఎస్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన జిపిఎస్ విధానమూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం లాభదాయకం కాదన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని సిఎం జగన్ అమలు చేయకపోగా..అందుకోసం పోరాడుతున్న ఉపాధ్యాయులు, నాయకులపై కేసులు బనాయించి, భయపెట్టడం తగదని చెప్పారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఒపిఎస్ అమలుకు విధివిధానాలు రూపొందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒపిఎస్ అమలు చేయాలని, లేనిపక్షంలో సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులతో కలిసి పోరాడతామన్నారు.

గుంటూరులో స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి లాడ్జీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకూ ఉపాధ్యాయులు 4కె వాక్ నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి ఎమ్మెల్సీ లక్ష్మణరావు నడకలో పాల్గొన్నారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం మొండి వైఖరి వీడి సిపిఎస్ రద్దు చేయాలన్నారు. ఇప్పటికే ఉన్న 1.80 లక్షల మంది ఉద్యోగులకు తోడు, సుమారు 1.30 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు కూడా సిపిఎస్ పరిధిలోకి వస్తున్నారని, అందరూ కలిసి మిగతా 2లో

## జార్ఖండ్‌లో ఘోరం

**గిరిజన మహిళను నరికి చంపిన దుండగులు**




**రాంచీ :** దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన ఢిల్లీ శ్రద్ధా వాకర్ హత్యోదంతాన్ని మరవకముందే అదే తరహాలో మరో దారుణ ఘటన జార్ఖండ్‌లో చోటుచేసుకుంది. సాహెబ్‌గంజ్ జిల్లా బోరియా పోలీసు స్టేషన్ పరిధిలో రుబికా పహాదిన్ (23) అనే గిరిజన మహిళను దాదాపు 50కి పైగా ముక్కలుగా నరికి హత్య చేశారు. కష్టసుఖాల్లో తోడుగా నిలువాల్సిన భర్తే మరికొందరు దుండగులతో కలిసి ఈ ఉన్మాద చర్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆమె భర్త దిల్దార్ అన్సారీ (28) అరెస్టు చేసి మిగిలిన దుండుగుల కోసం అన్వేషిస్తున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. రుబికా పహాదిన్, దిల్దార్ రెండేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. ఇటీవలే పెళ్లి చేసుకున్నారు. దిల్దార్‌కి ఇది రెండో వివాహం. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రలోభానికి గురిచేసినట్టు పోలీసులు తెలిపారు. అరెస్టు నుంచి తప్పించుకొనే ప్రయత్నంలో దిల్దార్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన భార్య తప్పిపోయిందంటూ మిస్సింగ్ కంప్లయింట్ ఇచ్చాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో సంతాలీ మోమిన్ తోలా ప్రాంతం లోని ఒక పాత ఇంటి వద్ద ఛిద్రమైన ఒక మహిళ మృతదేహం గుర్తించారు. దీంతో ఎస్పీ అనురంజన్ కిస్పొట్టా అక్కడికి చేరుకొని పరిశీలించారు. జాగిలాలను రంగంలోకి దించారు. ఆ మృతదేహం రుబికా పహాదిన్‌గా గుర్తించిన పోలీసులు దిల్దార్‌ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు. మహిళ శరీరాన్ని ముక్కలుగా చేసేందుకు ఎలక్ట్రిక్ కట్టర్ లాంటి పదునైన ఆయుధాన్ని దుండగులు వాడినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈ దారుణ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుండగులను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

## చేనేత కార్మికుడి ఆత్మహత్య

**ప్రజాశక్తి - ధర్మవరం టౌన్**


కృష్ణమూర్తి (ఫైల్)

అప్పుల బాధ తాళలేక చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన కాలూరు కృష్ణమూర్తి (56) పట్టుచీరలను నేస్తూ జీవనం సాగించేవారు. కరోనా తర్వాత ముడిసరుకుల ధరలు పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ముడిసరుకులు, కుటుంబ పోషణకు సుమారు రూ.ఆరు లక్షలు అప్పు చేశారు. అప్పు చెల్లించేందుకు ఆరు మగ్గాల్లో నాలుగింటిని రుణదాతలకు అమ్మేశారు. కరోనా సమయంలో ఆయన భార్య మరణించడం, అప్పుల వాళ్ల ఒత్తిడి తాళలేక తీవ్ర మనోవేధనకు గురయ్యేవారు. ఈ క్రమంలో ఇంట్లోని ఇనుప రాడ్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### తొలి కేబినెట్ సమావేశంలోనే ఒపిఎస్‌కు ఆమోదం

- హిమాచల్ ప్రదేశ్ సిఎం సుఖ్వీందర్ వెల్లడి
- బిజెపికి ఫిరాయింపులుండవని వ్యాఖ్య

• లోపలి పేజీలో.. •

### కుల దురహంకారం కాటేస్తోంది !

- వందలాది మంది ప్రాణాలు బలిగొంటోంది
- సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ ఆందోళన

### ఆంధ్ర జాతీయ విద్యాపరిషత్ విద్యా సంస్థలను
## రాష్ట్ర ప్రభుత్వమే నడపాలి

**సంస్థలో జరుగుతున్న అవినీతిపై విచారణ**

**సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ**

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఆంధ్ర జాతీయ విద్యాపరిషత్ విద్యా సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడపాలని, సంస్థలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాశారు.

బ్రిటీష్ విద్యావిధానానికి వ్యతిరేకంగా జాతీయ విద్యా విధానాన్ని అమలుపరచాలని ప్రజల నుంచి సేకరించిన విరాళాలతో 300 ఎకరాల భూమిని సేకరించి ఆంధ్ర జాతీయ విద్యాపరిషత్‌ను మచిలీపట్నంలో 1910లో స్థాపించారని తెలిపారు. నాటినుంచి జాతీయోద్యమానికి, తదనంతరం విద్యారంగానికి ఈ సంస్థ విశిష్ట సేవలనందించిందని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి వారు ఈ కళాశాలను పలుమార్లు సందర్శించారని, పింగళి వెంకయ్య, విశ్వనాథ సత్యనారాయణ వంటి ప్రముఖులు ఈ కళాశాలలో విద్యా బోధన చేశారని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి క్యాన్సర్ వైద్యులు నోరి దత్తాత్రేయుడు వంటి వారు ఈ కళాశాలలో చదువుకున్నారని, జాతీయ పతాకాన్ని, రాష్ట్రానికి రాజముద్రను అందించిన చరిత్ర ఈ విద్యా సంస్థదని వివరించారు. సంస్థ స్థాపన సమయంలోనే వ్యవస్థాపకులు వంశానుక్రమణ వారసత్వపు హక్కు ఎవరికీ ఇవ్వలేదని స్పష్టంగా రిజిస్టర్ చేశారని తెలిపారు. వ్యవస్థాపకులలో ఒకరైన కోపల్లె హనుమంతరావు పేరు పెట్టుకున్న ఒక వ్యక్తి (సర్కిల్ ఇన్‌స్పెక్టర్) అక్రమమార్గంలో వ్యవస్థాపక కుటుంబ సభ్యునిగా చేరాడని, ప్రైవేటుగా అభివృద్ధిచేసే పేరుతో సంస్థకు సంబంధించిన భూములు, ఆస్తులపై అజమాయిషీ చేస్తూ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని వివరించారు. దేవాదాయశాఖలో కొందరు ఇతని అవినీతికి సహకరిస్తున్నారని తెలిసిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో మిగతా 2లో

## ఏజెన్సీలో హైడ్రో ప్రాజెక్టులు తగవు

- సిఎంకు ట్రైబల్ వెల్ఫేర్ పూర్వ కమిషనర్ ఇఎఎస్ శర్మ లేఖ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)**

గిరిజన చట్టాలను ఉల్లంఘించి ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రైవేటుకు అప్పగించడం తగదని కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ పూర్వ కమిషనర్ ఇఎఎస్.శర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన సిఎం జగన్మోహన్‌రెడ్డికి ఆదివారం ఆయన లేఖ రాశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కురికుట్టి, కర్రివలస, అల్లూరి జిల్లాలోని ఎర్రవరం ఏజెన్సీ ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టులను షిరిడీ సాయి, అదానీ వంటి ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు. ఆయా ప్రాంతాల్లో అమలులో ఉన్న పీసా, అటవీ హక్కుల చట్టాలను ఉల్లంఘించి నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. ప్రాజెక్టులను ఏర్పాటు చేసేచోట గ్రామ సభలను సంప్రదించి, ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉన్నా ఆ పని జరగలేదన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రైవేటు కంపెనీలకు ప్రాజెక్టులు అప్పగించడం, భూములను లీజుకు తీసుకోవడం చట్ట విరుద్ధమని తెలిపారు. గిరిజనులకు నష్టం మిగతా 2లో


ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలకు దూళిపాళ్లలో జరిగిన సభలో చెక్కులు అందిస్తున్న పవన్ కల్యాణ్

## కష్టాల్లో కౌలు రైతులు

- మూడున్నరేళ్లలో మూడువేల మంది ఆత్మహత్య : పవన్ కల్యాణ్
- 210 మంది కౌలు రైతు కుటుంబాలకు సాయం

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

వ్యవసాయంలో కీలకభూమిక పోషిస్తున్న కౌలు రైతులు కష్టాల్లో ఉన్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. మూడున్నరేళ్లలో మూడు వేల మంది కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. రైతు భరోసా యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం దూళిపాళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆత్మహత్యలకు పాల్పడిన కౌలు రైతులకు చెందిన 210 కుటుంబాల వారికి ఒక్కొక్క కుటుంబానికి రూ.లక్ష చొప్పున రూ.2.10 కోట్ల ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ.. తనకు తాతలు సంపాదించిన ఆస్తులు లేవని, దోపిడి చేసి సంపాదించిన మిగతా 2లో

## ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తులకు నేటి వరకు గడువు పెంపు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తు గడువును పాఠశాల విద్యాశాఖ సోమవారం వరకు పొడిగించింది. ఉపాధ్యాయ బదిలీల్లో ఇచ్చిన ఉత్తర్వుల్లో కొన్ని నిబంధనలను సవరిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ నెల 17వ తేదీతో ముగిసిన బదిలీల దరఖాస్తు గడువును ఆదివారం వరకు పొడిగించింది. మరలా ఈ గడువును సోమవారం వరకు పొడిగించింది. దరఖాస్తుల పరిశీలన ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతుంది. 2021లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు బదిలీ కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉన్నత పాఠశాలల్లో (3-10, 6-10) పోస్టులు బ్లాక్ చేయడం ఉండదని తెలిపింది. విద్యార్థుల సంఖ్య 98 కంటే ఎక్కువ ఉన్న ప్రీహైస్కూళ్లల్లో ఖాళీల ప్రకారం బ్లాక్ చేస్తామని పేర్కొంది. ఖాళీలు తక్కువగా ఉంటే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల్లో (6-10) బ్లాక్ చేస్తామని వెల్లడించింది. ఫౌండేషన్ పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్ ఒకరు ఉంటారని తెలిపింది. రేషనలైజేషన్ వల్ల బదిలీ అయ్యే ఉపాధ్యాయులకు అదనంగా 5 పాయింట్లు ఉంటాయి. జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ప్రత్యేక పాయింట్లు ఐదు పాయింట్లు వస్తాయి.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## భార్యను హత్య చేసిన భర్త

**ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు**

భార్యను భర్తే దారుణంగా హత్య చేసిన సంఘటన శ్రీసత్యసాయి జిల్లా ఓబులదేవరచెరువు మండలం వీర ఓబనపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. మృతురాలి మేనత్త శాంతమ్మ తెలిపిన వివరాల మేరకు.. ఓబనపల్లి గ్రామానికి చెందిన తులసమ్మ (31), కేశవరెడ్డి దంపతులు. గతంలో వారు తిరుపతిలో ఉండేవారు. కేశవరెడ్డి ఎక్కువగా కోడిపందేలు ఆడేవాడు. ఈ విషయంపై భార్యభర్తలు తరచూ గొడవపడేవారు. ఈ నేపథ్యంలో వారు తిరుపతి నుండి ఓబులదేవరచెరువు మండలానికి తిరిగి వచ్చారు. కోడి పందేల విషయంలో ఆదివారం ఉదయం భార్యా భర్తలు మరోసారి గొడవపడ్డారు. కోపోద్రిక్తుడైన కేశవరెడ్డి.. తులసమ్మను కత్తితో పొడవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆంధ్ర జాతీయ విద్యాపరిషత్ విద్యా సంస్థలను రాష్ట్ర ప్రభుత్వమే నడపాలి

(మొదటి పేజీ తరువాయి)

సంస్థ భవిష్యత్‌పై విద్యాపరిషత్ నిర్వాహకులు, సంస్థ శ్రేయోభిలాషులు, విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకుని సంస్థలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. చారిత్రాత్మక విశిష్టత ఉన్న ఈ విద్యాసంస్థను ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని విద్యాసేవలను కొనసాగించాలని పేర్కొన్నారు. వ్యవస్థాపకుల లక్ష్యాలకు, సమాజ శ్రేయస్సుకు అనుగుణంగా విద్యాబోధన జరిగేటట్లు, ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# జాతీయ బ్యాంకుల్లోనే ప్రజల సొమ్ముకు భద్రత

- ప్రజాభాగస్వామ్యంతో బ్యాంకుల పరిరక్షణ పోరాటాలు
- బెఫీ జాతీయ అధ్యక్షులు నందకుమార్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

దేశంలో ప్రజల సొమ్ముకు భద్రత కల్పించడం జాతీయ బ్యాంకులతోనే సాధ్యమని బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ) జాతీయ అధ్యక్షులు సిజె నందకుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ బ్యాంకులను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టే చర్యలను ప్రజల భాగస్వామ్యంతో నిలువరించడానికి పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడ ఎంబివికెలో యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభ ఆదివారం జరిగింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన నందకుమార్ మాట్లాడుతూ జాతీయ బ్యాంకులు ఏర్పడిన తీరు, గత 50 సంవత్సరాలుగా జాతీయ బ్యాంకులు ప్రజా సంక్షేమానికి చేసిన కృషిని వివరించారు. 2008 ఆర్థిక సంక్షోభం దేశంపై తీవ్ర ప్రభావాన్ని చూపకపోవడానికి బ్యాంకింగ్ రంగం ప్రభుత్వ ఆధీనంలో ఉండడమే కారణమని అన్నారు. పెద్ద నోట్ల రద్దు సమయంలోనూ, కరోనా కాలంలో బ్యాంకు ఉద్యోగులు అనేక కష్టాలను అనుభవిస్తూ సేవలందించారని తెలిపారు. జాతీయ బ్యాంకుల నుంచి కార్పొరేట్లు తీసుకున్న రుణాలను తిరిగి కట్టించాల్సిన ప్రభుత్వాలు వారికి అండగా నిలిచి రుణమాఫీ చేస్తున్నాయని నంద కుమార్ విమర్శించారు. మొండి బకాయిలు వసూలు చేస్తే ఖాతాదారుల ప్రయోజనాలతోపాటు దేశాభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుతాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ హయాంలో వేగవంతమైన సంస్కరణల పేరుతో అన్నిరంగాలనూ ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం, లీజుకు ఇవ్వడమో చేస్తున్నాయని చెప్పారు. దేశానికి నష్టం కలిగించే ఈ చర్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి వాటి మార్పునకు కృషి చేయాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మహాసభకు ఆహ్వానం పలుకుతూ రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ రంగం కృషి చేస్తోందని అన్నారు. ఆ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు బహుళజాతి సంస్థలకు, ప్రైవేటు వ్యక్తులకు, కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్లకే లాభాలు కట్టబెడుతూ చేపడుతున్న చర్యలు దేశానికి నష్టం కలిగిస్తున్నాయన్నారు. అన్ని తరగతుల ప్రజానీకం ఈ విధానాలు, దుష్ప్రభావాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారన్నారు. ఈ మహాసభల్లో సిఐటియు రాష్ట్ర కోశాధికారి ఎవి నాగేశ్వరరావు, బెఫీ ఎపి కార్యదర్శి ఆర్ అజయ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పి.వెంకటరామయ్య, ఎల్ఐసి ఉద్యోగ సంఘ నాయకులు సిహెచ్ కళాధర్, యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, ఎస్‌వి రమణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బెఫీ జాతీయ అధ్యక్షులు నందకుమార్

## ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలి

- సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఎపి ఆరోగ్య మిత్ర ఎస్‌సి, ఎస్‌టి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకంలో కీలకపాత్ర ఆరోగ్య మిత్రలదేనని చెప్పారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు, రోగులకు అనుసంధానంగా ఉంటున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా రూ.15 వేల వేతనం మాత్రమే ఇస్తున్నారని, ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి కనీసం వేతనం కింద రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిఇవోలను కలిసి సమస్యలపై చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఎపి రాష్ట్రప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు అమలుచేయాలని, కారుణ్య నియామకాలు, వైద్య ఆరోగ్యశాఖ నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలని, ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. జిల్లాల వారీగా బాధ్యులను నియమించి జనవరిలో కమిటీలను వేసి భవిష్యత్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆరోగ్యమిత్రల ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి మాట్లాడుతూ క్రిస్మస్ కానుకగా తమకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి క్యాడర్ 1 కేటాయించాలని కోరారు. కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ఈ కార్యక్రమంలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కె.అప్పారావు, కోశాధికారి కాకాని నిర్మల, ఆదిలక్ష్మి పాల్గొన్నారు. సమావేశానికి ముందు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులును కలిసి యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

## అరాచకాలతో విలవిల్లాడుతున్న రాష్ట్రప్రజలు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో జగన్ అండ్ కో అరాచకాలతో ప్రజలు విలవిల్లాడుతున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. ప్రతిపక్షం చేస్తున్న కార్యక్రమాలపై అధికారపార్టీ నాయకులు దాడులకు తెగబడి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మాచర్లలో టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మ కార్యక్రమంపై వైసిపి చేసిన దమనకాండ మరువక ముందే సత్యసాయి జిల్లా, చెన్నే కొత్తపల్లి మండలం గువ్వలగొందంపల్లిలో మరో దుశ్చర్యకు వైసిపి నాయకులు ఒడిగట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. మాజీమంత్రి పరిటాల సునీత నిర్వహించిన రైతుకోసం టిడిపి పాదయాత్రలో పాల్గొన్న ఆటోడ్రైవర్ గోపాల్‌కు చెందిన ఆటోను తగులబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. టిడిపి అధికారంలో ఉండగా వైసిపి కార్యక్రమాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించిందని గుర్తు చేశారు. తెనాలిలో అన్నక్యాంటీన్లపై వైసిపి కార్యకర్తలు, నాయకులు విషం చిమ్ముతున్నారని, నేడు అన్న క్యాంటీన్‌ను తగులబెట్టి రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు.

**మహిళల జీవితాలతో ఆడుకుంటున్న జగన్ : ఆచంట**

సిఎం వైఎస్ జగన్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని మహిళల జీవితాలతో ఆడుకుంటున్నారని టిడిపి అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఆచంట సునీత విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. టిడిపి హయాంలో డ్వాక్రా మహిళలకు పెద్దపీట వేశారని తెలిపారు. ప్రస్తుతం సిఎం, వైసిపి సభలకు పల్లకీలను మోయడానికి డ్వాక్రా మహిళలను వాడుకుంటున్నారే తప్ప మహిళల కోసం, వారి సంక్షేమం కోసం ఒక్క రోజు కూడా ఆలోచించడం లేదని విమర్శించారు.

**పల్నాడు ఎస్‌పిని బదిలీ చేయాలి : వర్ల రామయ్య**

పల్నాడు ఎస్‌పి రవిశంకర్ రెడ్డిని వెంటనే బదిలీ చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. మాచర్ల ప్రాంతంలో కార్డన్ సెర్చ్ చేసిన తర్వాత కూడా వైసిపి గూండాలకు మారణాయుధాలు కత్తులు, గొడ్డళ్లు, కర్రలు, పెట్రోల్ సీసాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అధికార పార్టీ, ప్రభుత్వ ప్రేరేపిత హింస, ఇంటలిజెన్స్ డిజి సీతారామాంజనేయులు, ఎస్‌పి రవిశంకర్‌రెడ్డి ప్రోద్బలంతోనే జరిగినట్లుగా బాధితులు వాపోతున్నారని విమర్శించారు. బాధితులైన టిడిపి వారిపై హత్యాయత్నం, నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి, ఈ ఘోరకలికి కారకులైన వైసిపి వారిపై బెయిలబుల్ సెక్షన్లు పెట్టడం ఎస్‌పి పక్షపాత వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

# మాచర్ల ఘటనపై సమగ్ర దర్యాప్తు

- గుంటూరు రేంజ్ డిఐజి

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/అమరావతి బ్యూరో**

మాచర్లలో జరిగిన ఘర్షణపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని, నేరస్తులను వదిలిపెట్టే ప్రసక్తేలేదని గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమ వర్మ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, తమ వద్ద ఉన్న వీడియో పుటేజీ ఆధారంగా నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారి నుంచి కూడా వివరాలు సేకరించామని తెలిపారు. పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా టిడిపి నాయకులు పర్యటించడం సరికాదన్నారు. ముందస్తుగా టిడిపి వారు సమీప గ్రామాల వారిని సమీకరించినట్టు తెలిసిందన్నారు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఎవరైన ఇటువంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని, తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**డిఐజిని కలిసిన టిడిపి మాజీ మంత్రులు**

టిడిపి నాయకులపై హత్యాయత్నం కేసులు పెట్టి వైసిపి నాయకులపై సాదాసీదా కేసులు పెట్టడాన్ని టిడిపికి చెందిన పలువురు మాజీ మంత్రులు తప్పుపట్టారు. మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దేవినేని ఉమా మహేశ్వరరావు, కొల్లురవీంద్ర, నక్కా ఆనంద్‌బాబు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు ఆదివారం సాయంత్రం గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రవర్మను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. డిఐజిని కలిసిన అనంతరం సోమిరెడ్డి, నక్కా ఆనంద్‌బాబు, కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ కార్యక్రమంపై సమాచారం ఇచ్చినా తగిన బందోబస్తు ఏర్పాటు చేయలేదన్నారు. బ్రహ్మారెడ్డిని హత్య చేసేందుకు వైసిపి నాయకులు కుట్ర చేశారని ఆరోపించారు. టిడిపి వారు ప్రతిఘటించిన వీడియోలను మాత్రమే పరిశీలిస్తున్న పోలీసులు వైసిపి వారు చేసిన దాడులు, విధ్వంసం గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు.


బహ్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

అనంతరం గుంటూరులో నివాసముంటున్న బ్రహ్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

**టిడిపి నేతలకు చంద్రబాబు ఫోన్**

మాచర్ల దాడిలో గాయపడిన, ఆస్తినష్టం జరిగిన టిడిపి నాయకులు, వారి కుటుంబ సభ్యులను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఫోన్‌లో పరామర్శించారు. బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పోలీసుల అండతోనే తమపై, ఇళ్లపై దాడులు జరిగాయని బాధితులు చంద్రబాబుకు వివరించారు. దాడులతో తీవ్ర ఆవేదనలో ఉన్న బాధితవర్గంపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారని జిల్లా నేతలు చంద్రబాబుకు వివరించారు. 24 మందిపై హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాటి విషయం పార్టీ చూసుకుంటుందని చంద్రబాబు హామీనిచ్చారు. మాచర్ల ఘటనలో బాధితులనే నిందితులను చేస్తారా అని పోలీస్ ఉన్నతాధికారులపై ట్విటర్ వేదికగా చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పల్నాడు జిల్లా ఎస్‌పి రవిశంకర్‌రెడ్డిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన స్థానంలో ఆయన కార్యాలయంలో పనిచేస్తున్న హోంగార్డును కూర్చోబెట్టినా సమర్ధవంతంగా పనిచేసేవారని పేర్కొన్నారు.

## ప్యాకేజీ కోసం కాపులను బలిచేయొద్దు

- పవన్‌పై అంబటి ఆగ్రహం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్యాకేజీ కోసం కాపులను బలిచేయొద్దని, వారితో చంద్రబాబును మోయించొద్దని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కాపులను చంద్రబాబు మోసం చేశారని తెలిపారు. పవన్‌కల్యాణ్ వారాహి అని అమ్మవారి పేరుపెట్టుకున్న వాహనంపై ఎలా ఎక్కి దిగుతారని ప్రశ్నించారు. సత్తెనపల్లి సమావేశం వేదికగా టిడిపితో కలిసిపోతున్నట్లు వపన్ కల్యాణ్ సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా పార్టీ పెట్టి టిడిపి కోసం పనిచేస్తున్న పవన్ నేరుగా టిడిపిలోనే చేరిపోవచ్చని సూచించారు. తెలుగుదేశం పార్టీ వల్లే పల్నాడు జిల్లాలో అలజడులు జరుగుతున్నాయని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురజాల మాచర్లలో రూ.4,700 కోట్ల విలువైన పనులు జగన్ చేయిస్తున్నారని పేర్కొన్నారు. దీన్ని తట్టుకోలేకే ఆ ప్రాంతంలో అల్లకల్లోలం చేస్తున్నారని వివరించారు. ఏడుగురిని హత్య చేయించిన కేసులో బ్రహ్మారెడ్డి ఎ1 నిందితుడని, గుంటూరులో కాపురం పెట్టి మాచర్లలో అల్లర్లు చేస్తున్నారని అన్నారు.


నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

## మల్లాది విష్ణు కుమార్తె వివాహ వేడుకకు సిఎం హాజరు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

గుంటూరు జిల్లా మంగళగిరి సికె కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన ప్లానింగ్ బోర్డు రాష్ట్ర ఉపాధ్యక్షులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ కుమార్తె వివాహ వేడుకకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులు డాక్టర్ లలితా నాగదుర్గ, డాక్టర్ సాయి సూర్య తేజలను ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్, శాసన మండలి సభ్యులు తలశిల రఘురాం, లేళ్ళ అప్పిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్, తదితరులు ఉన్నారు.

## తొలి టెస్టులో భారత్ విజయం

- 188 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై గెలుపు



**చిట్టగాంగ్ :** ఐసిసి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో కీలక టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. 513 పరుగుల రికార్డు ఛేదనలో బంగ్లాదేశ్‌ను 324 పరుగులకే కుప్పకూల్చిన టీమ్ ఇండియా.. 188 పరుగుల తేడాతో గెలుపొందింది. ఐసీసీ డబ్ల్యూటీసీ జాబితాలో నాల్గో స్థానంతో బంగ్లాదేశ్‌తో తొలి టెస్టును ఆరంభించిన భారత్.. భారీ విజయంతో ఏకంగా రెండో స్థానానికి ఎగబాకింది. డిసెంబర్ 22 నుంచి జరిగే రెండో టెస్టులోనూ నెగ్గితే టీమ్ ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్స్ అవకాశాలను భారీగా మెరుగుపడనున్నాయి!. స్పిన్నర్లు అక్షర్ పటేల్ (4/77), కుల్దీప్ యాదవ్ (3/73) మాయజాలంతో ఐదో రోజు ఉదయం 11.2 ఓవర్లలోనే లాంఛనం ముగిసింది. షకిబ్ అల్ హసన్ (84, 108 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) బంగ్లా ఓటమి అంతరాన్ని తగ్గించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో పాటు విలువైన 40 పరుగుల ఇన్నింగ్స్ నమోదు చేసిన కుల్దీప్ యాదవ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

**11.2 ఓవర్లలోనే.. :** ఐదో రోజు ఉదయం పిచ్ మళ్లీ బ్యాటింగ్‌కు సులువుగా మారుతుందనే భయం భారత్‌ను వేధించినా.. స్పిన్నర్లు మాయజాలం చేశారు. ఓవర్‌నైట్ బ్యాటర్లు షకిబ్ అల్ హసన్ (84), మెహిది హసన్ మిరాజ్ (13) ఎంతోసేపు క్రీజులో నిలువలేదు. పేసర్ సిరాజ్ ఓవర్లో మెహిది మిరాజ్ క్యాచౌట్‌గా నిష్క్రమించగా.. మిగతా మూడు వికెట్లను అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చూసుకున్నారు. షకిబ్ అల్ హసన్ అర డజను బౌండరీలు, సిక్సర్లతో కాసేపు అలరించాడు. అతడికి జోరుకు కుల్దీప్ బ్రేక్ వేశాడు. క్లీన్‌బౌల్డ్‌తో బంగ్లా కెప్టెన్‌ను సాగనంపాడు. ఎబాడాట్ హొస్సేన్ (0)ను కుల్దీప్ డకౌట్ చేయగా.. తైజుల్ ఇస్లాం (4) వికెట్లను గిరాటేసిన అక్షర్ పటేల్ బంగ్లాదేశ్ కథ ముగించాడు. 113.2 ఓవర్లలో 324 పరుగులకు బంగ్లాదేశ్ కుప్పకూలింది. 188 పరుగుల భారీ తేడాతో భారత్ విజయం సాధించింది.

**రోహిత్ వస్తే ఎలా? :** భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు డిసెంబర్ 22 నుంచి ఆరంభం కానుంది. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై రెండు రోజుల్లో స్పష్టత రానుంది. రోహిత్ శర్మ ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి వస్తే తుది జట్టు కూర్పు నుంచి ఎవరిని తొలగించాలనే మీమాంస అప్పుడే మొదలైంది.

## బ్రూక్ శతకం : ముందంజలో ఇంగ్లాండ్

**కరాచీ (పాకిస్థాన్) :** పాకిస్థాన్‌పై ఇంగ్లాండ్ ఆధిపత్యం కొనసాగుతోంది. 2-0తో టెస్టు సిరీస్ విజయం కైవసం చేసుకున్న బెన్‌స్టోక్స్ గ్యాంగ్.. కరాచీలో క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. తొలుత పాకిస్థాన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులకు కట్టడి చేసిన ఇంగ్లాండ్.. తొలి ఇన్నింగ్స్‌లో విలువైన ఆధిక్యం దక్కించుకుంది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (111, 150 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీకి తోడు బెన్ ఫోక్స్ (64, 121 బంతుల్లో 6 ఫోర్లు), ఒలీ పోప్ (51, 64 బంతుల్లో 4 ఫోర్లు) అర్థ సెంచరీలతో రాణించటంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 354 పరుగులు చేసింది.

## ఏజెన్సీలో హైడ్రో ప్రాజెక్టులు తగవు

(మొదటి పేజీ తరువాయి)

చేకూర్చే చర్యలు తగవన్నారు. ఏజెన్సీలో తలపెట్టిన మూడు హైడ్రో పవర్ ప్రాజెక్టుల వల్ల గిరిజన సంస్కృతి, వారి జీవితాలు దెబ్బతింటాయని చెప్పారు. జల వనరులపైనా ప్రభావం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీలోని హైడ్రో పవర్ ప్రాజెక్టులను తక్షణం రద్దు చేయాలని కోరారు.

## స్ఫూర్తి ప్రదాత జస్టిస్ చిన్నపరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

సరిపోతుందని చెప్పారు. మత విశ్వాసాలనేవి వ్యక్తిగతమైనవని, ఎవరు ఏ మతాన్నైనా ఆచరించుకునే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు. ఇప్పుడు కొన్ని రాష్ట్రాల్లో జిల్లా కలెక్టర్ల అనుమతులు ఉండాలని చట్టాలు చేశారని తెలిపారు. కర్ణాటకలో హిజాబ్ ధరించారని విద్యార్థినులను పరీక్షలకు అనుమతించకపోవడం వల్ల 20 వేల మంది విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్లు, కాంట్రాక్టు విధానానికి వ్యతిరేకంగా ఆయన ఇచ్చిన తీర్పులు ఇప్పటి పరిస్థితులకు సరిపోతాయని వివరించారు. ఆయనలాంటి వారు మరెందరో రావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాదులు గురుప్రసాద్, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలోనూ లక్షలాది మందిపై పీడీ యాక్టును ప్రయోగించి జైళ్లలో పెట్టారని తెలిపారు. ఆ సమయంలో ఆయన ఇచ్చిన తీర్పు ఎంతో మందికి ఊరటనిచ్చిందని గుర్తు చేసుకున్నారు.

## సిపిఎస్ వద్దు.. ఒపిఎస్ ముద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం ఛైర్మన్ యం.హనుమంతరావు మాట్లాడారు. నెల్లూరులో ఎన్‌జిఒ హోం నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకూ 5కె వాక్ నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచినప్పటికీ సిపిఎస్ విధానాన్ని సిఎం జగన్మోహన్‌రెడ్డి రద్దుచేయకపోవడం దారుణమన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసేదాకా ఉద్యమం చేపడతామన్నారు. జనవరిలో ఉద్యమం ఉధృత రూపం దాల్చుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబిరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల్లో కౌలు రైతులు

(మొదటి పేజీ తరువాయి)

సొమ్ము లేదని నా కష్టార్జితంలో రైతులకు సాయం చేస్తున్నానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలవనివ్వబోమని ఇందుకోసం తనకో వ్యూహం ఉందన్నారు. ఇప్పటి వరకు అధికారం చూడని కులాలను అందలం ఎక్కించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తనను వారంతపు పొలిటిషియన్ అంటున్నారని, వారానికి ఒక్క రోజు వస్తేనే వైసిపి వాళ్లు తట్టుకోలేకపోతున్నారని రోజూ జనంలోకి వస్తే తట్టుకోలేరని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ఏడాది ముందే ఘర్షణలు సృష్టిస్తున్నారని, అధికార వ్యవస్థలను వినియోగించుకుని ఎలాంటి దాడులకైనా వైసిపి సిద్ధపడుతోందని ఆరోపించారు. వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్తు అంధకారమేని తెలిపారు. సత్తెనపల్లిలో ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి కూడా అవినీతి చేస్తున్నారని అంబటినుద్దేశించి విమర్శలు గుప్పించారు. "అంబటి కాపుల గుండెల్లో కుంపటి. పోలవరం పూర్తి చేయటం తెలియని ఆయన నీటిపారుదల మంత్రిగా ఉండటం సిగ్గుచేటన్నారు. 'ఎన్నికల వ్యూహం నాకు వదిలివేయండి... జనసేనను అధికారం దిశగా నడిపించే బాధ్యత నాది...మీ బాధ్యతలు మీరు చేయండి' అని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్, పార్టీ సీనియర్ నాయకులు కల్యాణం శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.


సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

# టి కాంగ్రెస్‌లో తీవ్ర విభేదాలు

- సీనియర్లు వర్సెస్ రేవంత్ టీం
- కార్యవర్గ సమావేశానికి సీనియర్లు డుమ్మా
- పార్టీ పదవులకు రేవంత్ టీం రాజీనామా
- అంతర్గత వ్యవహారాలు అధిష్టానమే చూసుకుంటుందన్న రేవంత్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం కోసం టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి రాష్ట్రమంతటా పాదయాత్రకు ప్లాన్ చేస్తున్న సమయంలో తెలంగాణ కాంగ్రెస్‌లో విభేదాలు తారాస్థాయికి చేరాయి. సీనియర్లు, వలసవాదులు (రేవంత్ టీం)గా పార్టీ చీలిపోయింది. పిసిసి పదవుల ప్రకటన నాటి నుంచి రేవంత్‌పై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్న సీనియర్లు.. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన పిసిసి కార్యవర్గ సమావేశానికి డుమ్మాకొట్టారు. ఎంపి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మధుయాష్కి, దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ప్రేంసాగర్ రావు ముఖం చాటేశారు. సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క కూడా హాజరుకాకపోవడం విశేషం. అంజన్‌కుమార్ యాదవ్, షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, మల్లు రవి, చెరుకు సుధాకర్, శంకర్‌నాయక్, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, తదితర కార్యవర్గ సభ్యులతోనే రేవంత్ సమావేశం నిర్వహించారు. పాదయాత్రతో పాటు కీలకమైన అంశాలపై చర్చించాల్సి ఉన్నా సీనియర్లు డుమ్మాకొట్టడం.. టి కాంగ్రెస్ రెండుగా చీలిందన్న సంకేతాలకు ఊతమిస్తుంది.

పిసిసి అధ్యక్షులుగా రేవంత్ రెడ్డిని ప్రకటించిన నాటి నుంచి గుర్రుగా ఉన్న సీనియర్లకు.. ఇటీవల ప్రకటించిన పిసిసి పదవులు తీవ్ర అసహనానికి గురిచేసింది. తమను సంప్రదించలేదని కొందరు, పాతవాళ్లకు ప్రాధాన్యం ఇవ్వలేదని, తన మనుషులకే రేవంత్ పదవులు పందేరం చేశారని మరికొందరు రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో మీడియా సమావేశం పెట్టి తమ అసంతృప్తి వ్యక్తంచేశారు. తనకు ప్రాధాన్యంలేని పదవి ఇచ్చారని మాజీ మంత్రి కొండా సురేఖ పార్టీ పదవికి రాజీనామా చేశారు. సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క ఇంట్లో శనివారం సీనియర్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, మధుయాష్కీగౌడ్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, సంజీవరెడ్డితోపాటు మరికొంతమంది నాయకులు సమావేశమయ్యారు. రేవంత్ ఒంటెద్దు పోకడలపై ఢిల్లీలోనే తేల్చుకుందామని వారు నిర్ణయించుకున్నారు. అయితే, రేవంత్ టీంగా ముద్రపడిన 12 మంది నాయకులు పార్టీ పదవులకు ఆదివారం రాజీనామా చేశారు. సీతక్క, వేం నరేందర్ రెడ్డి, సిహెచ్ విజయ రమణారావు, దొమ్మాటి సాంబయ్య, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, వజ్రేశ్ యాదవ్, చారగొండ వెంకటేశ్, సుభాష్ రెడ్డి,పటేల్ రమేశ్ రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, సత్తు మల్లేశ్, శశికళ యాదవ రెడ్డిలు పార్టీలోని తమ పదవులకు రాజీనామా చేశారు. పదవుల పేరుతో గిల్లికజ్జాలు పెట్టుకొని ప్రజాసమస్యలను గాలికొదిలేయడం మంచిదికాదని, పదవుల వివాదానికి ముగింపు పలికేందుకు తమ పదవులకు రాజీనామా చేస్తున్నామని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు మాణిక్కం ఠాగూర్‌కు ఐదు పేజీల లేఖ రాశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని లేఖలో ప్రకటించారు. పదవుల పందేరంలో రేవంత్‌ను ఏకాకిని చేయాలనుకున్న సీనియర్లకు వ్యూహాత్మకంగా చెక్ పెట్టినట్లయింది. ఇదిలాఉంటే, పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే అనిల్ సీనియర్లకు ఆదివారం కౌంటర్ ఇచ్చారు. 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీని వీడినప్పుడు ఈ సీనియర్లు ఏం చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను బలహీనపర్చే ముసుగువీరులు బైటకు వచ్చారని ఘాటుగా స్పందించారు. సీనియర్ల వ్యవహారంతో కాంగ్రెస్ రెండు గ్రూపులుగా విడిపోయినా పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి మాత్రం ఈవ్యవహారాన్ని పెద్దగా పట్టించుకోనట్లు స్పందిస్తున్నారు. పిసిసి కార్యవర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనవరి 26 నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సీనియర్ల వ్యవహారంపై ఆందోళన అవసరంలేదని, పార్టీ హైకమాండ్ చూసుకుంటుందని రేవంత్ తెలిపారు.

## దళితుడిపై దాడిచేసిన ఎస్ఐపై చర్యలు

- డిజిపికి కెవిపిఎస్ లేఖ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తి మండలం ఉప్పలపాడులో దళితుడు తలారి రవికుమార్‌పై ఎస్ఐ సుమన్ దాడికి పాల్పడటం, బెదిరిస్తుండటంపై విచారించి తగుచర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి కోరారు. ఈ మేరకు ఆదివారం డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డికి లేఖ రాశారు. మండల పరిధిలోని ఇద్దరి వద్ద రవికుమార్ రెండు ఎకరాలు కౌలు చేస్తున్నారని తెలిపారు. దీనిలో 50 సెంట్లలో వరినాట్లు వేయగా, దానిపై ఎస్ఐ జోక్యం చేసుకుని ఆ భూమి వివాదంలో ఉందని, కౌలు ఎలా చేస్తావని ప్రశ్నిస్తూ తీవ్రంగా కొట్టారని తెలిపారు. తాను రూ.26 వేలు ఖర్చు చేశానని, ఇప్పించేస్తే వెళ్లిపోతానని రవికుమార్ చెప్పగా, డబ్బులు ఇచ్చేది లేదంటూ ఎస్ఐ పొలాన్ని ట్రాక్టర్‌తో తొక్కించారని పేర్కొన్నారు. దీనిపై గ్రీవెన్స్‌లో ఎస్‌పికి ఫిర్యాదు చేశారని, విచారించిన అధికారి రవికుమార్‌ను సాగు చేసుకోవాలని తెలిపారనీ వివరించారు డిఎస్‌పి ఆదేశాల మేరకు కేసు కూడా నమోదు చేశారని వివరించారు. ఇటీవల ఎస్ఐ ప్రతిరోజూ రవికుమార్ ఇంటికి పోలీసులను పంపి కేసు విత్‌డ్రా చేసుకోవాలని బెదిరిస్తున్నారని, విచారించి తగు చర్యలు తీసుకోవాలని లేఖలో మాల్యాద్రి కోరారు.

## విద్యుత్ పొదుపు సామాజిక బాధ్యత : ఎపిఇఆర్‌సి ఛైర్మన్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్యాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఛైర్మన్ జస్టిస్ సివి నాగార్జునరెడ్డి చెప్పారు. వీటిపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వెల్లడించారు. ఇంధన సంరక్షణ వారోత్సవాల సందర్భంగా విద్యుత్ పంపిణీ సంస్థలు, ఇంధన పరిరక్షణ మిషన్ అధికారులతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదా చేసే ప్రతి యూనిట్ రెండు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తితో సమానమని అన్నారు. పొదుపును వినియోగదారులందరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతోపాటు అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యుత్ వినియోగదారులు ఈ చర్యలను పాటించాలని సూచించారు. రాష్ట్రంలో ఫాస్ట్‌ట్రాక్ మోడ్‌లో నిర్దిష్ట ప్రణాళికను రూపొందించాలని సూచించారు. రాష్ట్రం మొత్తం ఇంధన డిమాండ్‌లో గృహ విద్యుత్ వినియోగం దాదాపు 25 శాతం ఉందని పేర్కొన్నారు. సమర్థవంతమైన ఉపకరణాలపై వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా పొదుపును పెంచాలని కమిషన్ సభ్యులు పి రాజగోపాల్‌రెడ్డి, ఠాకూర్ రామ్‌సింగ్ సూచించారు. జాతీయ ఇంధన సంరక్షణ అవార్డులు ఇస్తున్నట్లుగానే రాష్ట్రస్థాయి ఇంధన సంరక్షణ అవార్డులు-2022 పోటీలను నిర్వహించామని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివరించారు. ఈ నెల 20న విజయవాడలో విజేతలకు కేటగిరీల వారీగా అవార్డులు, బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో డిస్కమ్‌ల సిఎండిలు జె పద్మజనార్ధన రెడ్డి, కె సంతోషరావు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగ తెగిపడి మహిళ మృతి

- మరొకరికి గాయాలు

**ప్రజాశక్తి-త్రిపురాంతకం (ప్రకాశం జిల్లా)**

హైటెన్షన్ విద్యుత్ తీగ తెగిపడి మహిళ మృతి చెందిన సంఘటన ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. వెల్లంపల్లికి చెందిన యోహానమ్మ కుమార్తె బంక సునీత (30)కు 12 ఏళ్ల క్రితం మండలంలోని రాజుపాలెంకు చెందిన భాగ్యారావుతో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. క్రిస్మస్ పండుగ సందర్భంగా సునీత వెల్లంపల్లిలోని తన పుట్టింటికి వచ్చారు. ఈ నేపథ్యంలో తల్లితో కలిసి బట్టలు ఉతికేందుకు దిబ్బగిరి వాగుకు వెళ్లారు. అక్కడ బట్టలు ఉతుకుతుండగా వాగు పైనుంచి వెళ్లే విద్యుత్ వైరు తెగిపడి సునీతను తాకడంతో ఆమె షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెను కాపాడే ప్రయత్నంలో యోహానమ్మకు కూడా గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు యోహానమ్మను త్రిపురాంతకంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సునీత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యర్రగొండపాలెం ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

# అబ్బురపరిచిన బాలోత్సవం

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ**

గాంధీ, నెహ్రూ, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి స్వాతంత్ర్య సమర యోధులు, ఝాన్సీ లక్ష్మీబాయి, రుద్రమదేవి, కట్టబ్రహ్మన్న వంటి వీరుల వేషధారణతో చిన్నా రులు అలరిం చారు. దేశఖ్యాతి, కీర్తిప్రతిష్టలు, భారతీయుల గొప్పదనాన్ని తెలుపుతూ జాతీయ గీతాలాపనలు ఓ పక్క, భారతదేశ పుట్టినిల్లు అని చెప్పకునే శాస్త్రీయ నృత్యాలతో మైమరిపిస్తున్న కళాప్రదర్శనలు మరోపక్క. గ్రామీణప్రాంత గొప్పతనాన్ని, జానపద రసరమ్యాన్ని రంగరించి గజ్జకట్టి, డప్పు వాయిస్తూ గెంతుతున్న అద్భుత దృశ్యాలు ఇంకోపక్క. పదునైన పదధోరణితో, క్లిష్టతరమైన వాక్యాలను రంగరించి తమ గాంభీరస్వరాలతో ఆశ్చర్య చకితులను చేస్తున్న ఏకపాత్రాభినయాలు, మరో పక్క. కోలాటాల కోలాహలం. చిత్రవిచిత్ర వస్త్రధారణతో చిన్నారులు చిరుసవ్వడిలు. ఏ దిక్కు చూసిన కళాసందడి. అడుగడుగునా విద్యార్థుల సమూహం. నిమిషాల్లోనే సరికొత్త ప్రదర్శనలు. గంట మారగానే కొత్తపోటీలు. ప్రాంగణానికి ఇరువైపుల కంచు ప్రహారీల నిలుచుని, తమ పిల్లల ప్రతిభను ఆశక్తితో తిలకిస్తున్న తల్లిదండ్రులు. ఉపాధ్యాయుల హడావిడి. కళాప్రియులు ఉత్తేజపు కేకలు. ఇలా ఎటు చూసిన ఉత్సవ వాతావరణమే. తిరుపతి కేంద్రంగా నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ వేదికగా జరుగుతున్న బాలోత్సవంలో విద్యార్థుల కళాపండగ ఇది. తిరుపతిలో ప్రపథమంగా జరుగుతున్న బాలోత్సవంలో 30 అకడమిక్, 10 సాంస్కృతిక విభాగాల్లో మొత్తం 40 ఈవెంట్లు చేపట్టారు. ఇందులో ప్రభుత్వ, నగరపాలక, టిటిడి, ప్రయివేట్ అన్ని పాఠశాలల విద్యార్థులు వేలసంఖ్యలో హాజరయ్యారు. సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ అంటూ మూడు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. చివరగా విద్యార్థులకు బాలోత్సవ కమిటీ నాయకులు బహుమతులు ప్రదానం చేశారు.



భగత్ సింగ్, నెహ్రూ వేషధారణలో విద్యార్థులు



కాంతారా చిత్రంలోని వేషంలో విద్యార్థి

# పని ఒత్తిడితో ఉద్యోగుల ఆత్మహత్యలు

- హక్కుల సాధనకు సంక్రాంతి తర్వాత ప్రత్యక్ష ఆందోళనలు
- ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు




మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి-గుంటూరు**

బకాయిలు, వేతనాలు సకాలంలో అందక ఒక వైపు ఉద్యోగులు ఇబ్బంది పడుతుంటే.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం పనిభారం మోపుతోందని, ఇది భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. పని ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగులకు వేతనాలు, బకాయిలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సిపిఎస్ రద్దు హామీ నిలబెట్టుకోవాలని తదితర హక్కుల సాధనకు సంక్రాంతి తర్వాత ప్రత్యక్ష ఆందోళన చేస్తామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్షులు వి.వి.మురళీకృష్ణనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతుల ఆత్మహత్యలు చూశామని, ఇప్పుడు ఉద్యోగుల ఆత్మహత్యలు చూడాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు.

అధికారులను సస్పెండ్ చేస్తున్నారని, విజిలెన్స్ విచారణలు, ఎసిబి కేసులు పెడుతూ వేధిస్తున్నారని విమర్శించారు. కలెక్టర్లకు ర్యాంకులు ఇవ్వడం వల్లే ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందని, ర్యాంకులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి.వి.మురళీకృష్ణయాదవ్, కె.సంగీతరావు, ఉపాధ్యక్షులుగా వివి దయాళ్, ఎం.అర్జున అప్పారావు, కెజెఎస్ చంద్రారెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా కె.శివరమణ కృష్ణారావు, ఎం.నాగేంద్రకుమార్, బి.డి.శ్రీనివాస రావు, ట్రెజరర్‌గా ఆర్.శ్రీనివాసరావు మరో ఐదుగురితో కార్యవర్గం ఎన్నికైంది.

# ఏప్రిల్ నుంచి ప్రత్యక్ష కార్యాచరణ

- ప్రభుత్వం అన్ని హద్దులూ దాటేసింది : సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

**ప్రజాశక్తి-గుంటూరు**

ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని హద్దూలూ దాటేసిందని, సమస్యలు పరిష్కరించకపోతే ఏప్రిల్ నుండి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ అన్నారు. ఊకదంపుడు ఉపన్యాసాలు కాకుండా ఉద్యోగులను చైతన్య పరిచి దీర్ఘకాలిక పోరాటానికి సమాయత్తం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించాలని, వాస్తవ పరిస్థితిని గుర్తించాలని అన్నారు. గుంటూరు మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని జింఖానా ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఎపిజిఇఎ జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశంలో సూర్యనారాయణ, సంఘం ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విలేకరులతో సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగుల సహనానికీ ఒక హద్దు ఉంటుందని, కానీ ప్రభుత్వం అన్ని హద్దులూ దాటేసిందన్నారు. గత పిఆర్‌సి అనుభవం దృష్ట్యా 2023 జులై నుండి అమలు చేయాల్సిన 12వ వేతన సవరణను ఎలాంటి కమిటీలు లేకుండా నేరుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన ప్రక్రియను ఏప్రిల్ నుంచే చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగుందని సాక్షాత్తూ సిఎం చెబుతున్నారని, కానీ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు ఇవ్వట్లేదని తెలిపారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు, బకాయిలు ఎందుకు చెల్లించలేకపోతున్నారని ప్రశ్నించారు. దీనిపై ఆర్థిక మంత్రి సచివాలయానికి వచ్చి ఉద్యోగ సంఘాలకు సమాధానం చెప్పాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖల, వాణిజ్య పన్నుల శాఖలో సంస్కరణల పేరుతో ఏకపక్ష ధోరణి విడనాడాలని, ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## జనసేన తీర్థం పుచ్చుకున్న బొంతు

- పవన్ కల్యాణ్ సమక్షంలో పలువురు నాయకుల చేరిక

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

పలు నియోజకవర్గాలకు చెందిన వైసిపి కీలక నేతలు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. మంగళగిరి జనసేన రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, బొంతు రాజేశ్వరరావును పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజేశ్వరరావు 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజోలు నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా కూడా పనిచేశారు. విజయనగరం జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త గురాన అయ్యలు, పి.గన్నవరం నియోజకవర్గం నుంచి నగరం ఎఎంసి ఛైర్మన్ కొమ్మూరి కొండలరావు కూడా జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

# విఆర్‌ఒలపై పని ఒత్తిడి తగ్గించాలి

- ఎపి విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

విఆర్‌ఒలకు రీ సర్వేతోపాటు రెగ్యులర్ రెవెన్యూ సర్వీసులు ఉండటంతో పనిభారం పెరిగిందని, ఈ నేపథ్యంలో పనిఒత్తిడిని తట్టుకోలేక అనేకమంది రెవెన్యూ సిబ్బంది ఆత్మహత్య చేసుకుంటున్నారని ఎపి విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఎపి విఆర్‌ఒల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చెప్పినట్లు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విధులు నిర్వహించేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. విఆర్‌ఒ, గ్రామ సర్వేయర్లకు బయోమెట్రిక్ నుంచి మినహాయింపు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో నూటికి 90 శాతం రెవెన్యూకు సంబంధించిన సర్వీసులు విఆర్‌ఒలు చేస్తున్నప్పటికీ ప్రత్యేకంగా కంప్యూటర్ ఇవ్వలేదని, స్టేషనరీకి ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. భూముల రీసర్వేకు సంబంధించి దీర్ఘకాలిక ప్రణాళిక ఉండాల్సి ఉందన్నారు. వంద రోజుల్లోనే భూముల రీ సర్వే పూర్తి చేయాలనే నిబంధనను సడలించి విఆర్‌ఒలపై ఒత్తిడి లేకుండా చేయాలని రవీంద్రరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరణించిన గ్రామ రెవెన్యూ అధికారుల కుటుంబాలకు వెంటనే రూ.25 లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించాలని, వారి కుటుంబ సభ్యులకు జిఒ నెంబరు 658 ప్రకారం ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం.అప్పలనాయుడు, ఎపి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విఆర్‌ఒల సంఘం అధ్యక్షులు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న మంత్రి రోజా

## లంబసింగిలో హరిత రిసార్ట్స్ ప్రారంభం

**ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)**

గండికోట, అరకు వ్యాలీ, పాడేరు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా వెల్లడించారు. అల్లూరు సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లంబసింగి వద్ద ఎపి పర్యాటకాభివృద్ధి సంస్థ రూ.మూడు కోట్ల వ్యయంతో నిర్మించిన హరితా రిసార్ట్సును ఆదివారం ఆమె ప్రారంభించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అరకు వ్యాలీ, కొత్తపల్లి, తాజంగి, వంజంగి ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక పరంగా దేశంలో ఎపి మూడో స్థానంలో ఉందని తెలిపారు. లంబసింగిలో ఎపిడిసి ఆధ్వర్యంలో ఇప్పటి వరకు నాలుగు రిసార్ట్సు ఉన్నాయని, తాజాగా మరో 11 ప్రారంభించామని తెలిపారు. ఏజెన్సీలో టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. 1991లో చామంతి సినిమాలో పాట చిత్రీకరణకు ఇక్కడకు వచ్చానని, నాటి నుంచి నేటి వరకూ పలుసార్లు ఏజెన్సీలో పర్యటించానని తెలిపారు. అనంతరం గిరిజనులతో మంత్రి రోజా థింసా నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిడిసి ఛైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, జిసిసి అధ్యక్షురాలు శోభ స్వాతిరాణి తదితరులు పాల్గొన్నారు.

## స్పెషలిస్టు డాక్టర్లకు ప్రోత్సాహకాలు

- ఎపివివిపి కమిషనరు డాక్టర్ వినోద్‌కుమార్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

మారుమూల గిరిజన ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ముందుకు వచ్చే స్పెషలిస్టు డాక్టర్లకు సిఎం జగన్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ప్రోత్సాహకాలకు మంచి స్పందన లభిస్తోందని ఎపివివిపి కమిషనరు డాక్టర్ వినోద్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనేకమంది స్పెషలిస్టులు చింతూరు, కూనవరం, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పాడేరు జిల్లా ఆసుపత్రిని ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఎపి వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రుల్లోనే దాదాపు 1250కి పైగా స్పెషలిస్టు డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో 463 ఉద్యోగోన్నతి పోస్టులు కాగా, 792 పోస్టులు ప్రత్యక్ష నియామక సిఎఎస్ పోస్టులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్పెషలిస్టు డాక్టర్లను ఆకర్షించేందుకు ప్రభుత్వం భారీగా వేతనాలు ప్రకటించిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేందుకు ముందుకొచ్చే వారికి కాంట్రాక్టు పద్ధతిలో నెలకు రూ.2 లక్షలు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేందుకు ముందుకు వచ్చే స్పెషలిస్టులకు రూ.2.50 లక్షలు వంతున పారితోషికాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు.

## తెనాలిలో అన్న క్యాంటీన్‌కు నిప్పు

**ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)**

గుంటూరు జిల్లా తెనాలిలో అన్న క్యాంటీన్‌కు దుండగులు నిప్పు పెట్టారు. పురపాక సంఘం కార్యాలయం వద్ద టిడిపి హయాంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూసివేశారు. ఆదివారం తెల్లవారుజామున అన్న క్యాంటీన్ తలుపుకు దుండగులు నిప్పంటించారు. మంటలు ఎగసిపడడంతో స్థానికులు స్పందించి మంటలను ఆర్పివేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కొందరు టిడిపి నాయకులు అన్న క్యాంటీన్ వద్దకు చేరుకుని, పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు పట్టణ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



"సమాజాన్ని అప్రతిష్ట పాలు చేసే పరిస్థితిని కళ్ల ముందర పెట్టి, నైతిక భావాల్ని, ఉన్నత ప్రమాణాల్ని ప్రాచుర్యంలోకి తేవడం కంటే- సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేమీ లేదు. "

- గురజాడ



## గోడలు మాట్లాడాలి!

గోడలు మాట్లాడుతున్న వేళ
రోడ్లు జనంతో కదలబారేవి
అడవి పాటల పల్లవయ్యేది
నదులు ఉప్పొంగి ప్రవహించేవి
సముద్రం ఆకాశాన్ని అవనికి చేర్చేది

గోడలు మూగబోయిన వేళ
దారులు మూసుకుపోయాయి
ప్రశ్నలు జైళ్లలో బంధించబడ్డాయి
నదుల జాడలు చెరిగిపోతున్నాయి
అడవి ఒంటరి ఆకాశమయింది

మరల గోడలు మాటాడాలి
నెత్తురంటిన వాక్యం నినాదమై
రాయబడాలి!

– కెక్యూబ్
94934 36277




## అతడు

రోజూ నాకు కనిపిస్తుంటాడు
అతడు విరామచిహ్నం లేని
సుదీర్ఘ వాక్యంలా ఉంటాడు.
అతడు
వాళ్ళ పూర్వీకులెప్పుడో పోగొట్టుకున్న దానిని
ఇప్పుడు వెతుక్కుంటున్నట్లుంటాడు
ఎవరో మూడు పాదాలు రాసి
వదిలేసిన పద్యంలా ఉంటాడు
ఆలింగనానికి ఆహ్వానిస్తూనే
స్వీయ క్వారంటైన్ పాటిస్తాడు.
సజల ప్రవంతిని అనుకుంటూ
ఎండిపోయిన కాలువలా ఉంటాడు
పుస్తకంలో కాగితాల మధ్య
నెమలీక అనుకుంటూ
పుస్తకంలోంచి రాలిపోయి
గాలికి కొట్టుకుపోతున్న
పాత కాగితంలా ఉంటాడు.
అతడు
ఇంకా నాకు రోజూ ఎదురౌతూనే ఉంటాడు!

– రాచపాళెం

# ఓ చరిత్రకారుని జీవిత ప్రగతి పతాక

తెలుగునాట ప్రగతిశీల చరిత్రకారుల్లో ప్రసిద్ధులైన ఆచార్య వకుళాభరణం రామకృష్ణ తన సంక్షిప్త ఆత్మకథకు 'నన్ను నడిపించిన చరిత్ర' అని పేరు పెట్టుకున్నారు. తను నడచిన చరిత్ర అనీ, చరిత్రతోనే తన నడక ముడిపడివుందని ఆయన భావన. వాస్తవానికి నడిపించినది లలిత అన్న కృతజ్ఞత ఈ పుస్తకం పొడుగునా కనిపిస్తుంది. ఆయన రాసిన రాయించిన అనేక చరిత్ర పరిశోధన పుస్తకాలే గాక ఈ ఆత్మకథా శకలాలు కూడా ఆమె ఆకాంక్ష మేరకే రాశానన్నారు. మిత్రులూ, శ్రేయోభిలాషులూ, పరిచయస్తులనే తనకున్న వెల కట్టలేని సంపదగా అభివర్ణించిన రచయిత – ప్రతి ఘట్టంలో వారిని పునర్దర్శనం చేయించారు. చరిత్ర రచనలో ఆరితేరినవారు గనక వాటిని వ్యక్తిగత అనుబంధాలుగానే గాక చరిత్రగతితోనూ, సామాజిక పరిణామాలతోనూ కలగలిపి చెప్పగలిగారు. పెద్దగా వనరులు లేని ఒక సంప్రదాయ కుటుంబ యువకుడు ఆశయబలంతో ఉన్నత విద్యాశిఖరాలు అధిరోహించడం, అందుకు సహకరించిన జీవిత భాగస్వామిని లలిత ప్రేమాస్పద శ్రమాస్పద పాత్రనూ ఇందులో చూస్తాం. మేధావులను నిరుత్పాదక పాత్రధారులుగానూ, కుహనా జీవులుగానూ చెప్పే అసహన వాతావరణం నిండిన ఈ రోజుల్లో ఇరవయ్యో శతాబ్దిని ముందుకు నడిపేందుకు దోహదపడిన ప్రగతిశీల బుద్ధిజీవుల విలక్షణ పాత్రకు ఈ పుస్తకంలో విషయాలు అద్దం పడతాయి. ఎన్ని ఉన్నత స్థానాలు అధిరోహించినా తమకు తొలి ప్రేరణ అయిన అరుణ పతాకాన్ని, ఆ ఉద్యమాల స్ఫూర్తిని మరచిపోకపోవడం ఈ పుస్తకంలో మనం చూసే మరో విశేషం.



ప్రకాశం జిల్లా దర్శి తాలూకా రామభద్రాపురం కుగ్రామంలో 1938లో వకుళాభరణం రామకృష్ణ పుట్టారు. తాత, తండ్రి అర్చకులు. సంపాదన జీవికకు సరిపోక తండ్రి అప్పటి నెల్లూరు జిల్లాలోని పాకాల గ్రామానికి తరలివెళ్లారు. ఊళ్లో వున్న ఒక మాష్టారు దగ్గర చదువుకుంటుంటే అనుకోని ఘటనలతో కక్ష గట్టిన ఆయన చదువుకునే అవకాశం లేకుండా చేశాడు. దగ్గర్లోని కందుకూరుకు మారి అన్నయ్యతో పాటు తనూ చదువుకున్నారు. నాటి గ్రామీణ వాతావరణం, వృత్తి వ్యవసాయాలు సామాజిక జీవనం నుంచి జానపద కళల వరకూ చెప్పడం ఆయన పరిశీలనను, ఆసక్తిని తెల్పుతుంది. నాటి ఆటపాటలనూ అంతే ముచ్చటగా రాశారు. పెద్దవారయ్యాక విదేశాలకు, ఇతర ప్రతిష్టాత్మక సంస్థలకూ వెళ్లినప్పుడు కూడా ప్రత్యేకతలు అక్షరీకరిస్తూనే వచ్చారు. ఆచార వ్యవహారాల నుంచి కులమతాల సంబంధాలు అందరినీ గౌరవించాలనే నాన్నగారి నిర్దేశం కూడా గుర్తుచేసుకున్నారు. నెల్లూరులో రెండేళ్లపాటు చదువుకున్న 1948–50 కాలంలో సమాజాన్ని అర్థం చేసుకోవడం మొదలెట్టారు. అది కమ్యూనిస్టు పార్టీపై నిషేధం నడుస్తున్న కాలం. అన్నయ్య నరసింహాచార్యులు కూడా రహస్య యంత్రాంగంతో సంబంధంలో వున్నట్టు కనిపిస్తుంది. స్వాతంత్ర్య పోరాటం, సాహిత్య వికాసం వంటివాటికి పెట్టింది పేరైన నెల్లూరు జిల్లాలో నాటకాలకు, సినిమాలకు ఆదరణ ఎక్కువ. ఈ ప్రభావం కూడా పడింది. సింగరాయకొండలో ఆయన ప్రజానాట్య మండలి కళారూపాలు చూడగలిగారు. ఉపాధ్యాయ నేతలైన సింగరాజు రామకృష్ణయ్య, చెన్నుపాటి లక్ష్మయ్య అక్కడే ఆయనకు కలిశారు. కమ్యూనిస్టు పార్టీకి అగ్నిపరీక్షా కాలమైన ఆ దశలో చారిత్రికాంశాలు, సైద్ధాంతిక పరిణామాలు కూడా గుర్తు చేశారు. కమ్యూనిస్టు అభిమాని అయిన వారి నాన్న మూడో కుమారుడిని జోషీ అని పిలుచుకున్నారు.

తదుపరి దశలో ఆయన చైతన్యశీలమైన కావలి కాలేజీలో చేరడం జీవితంలో కీలక ఘట్టం. ఆచరణ, చైతన్యం, కొత్త శక్తి సంతరించుకున్నాయి. విశ్వోదయ తర్వాత జవహర్ భారతిగా పేరు గాంచిన ఆ సంస్థ వ్యవస్థాపకుడైన డిఆర్ (దొడ్ల రామచంద్రారెడ్డి) కవి భుజంగరాయ శర్మ, కెవి రమణారెడ్డి వంటివారితో ఆయన మమేకమైంది అక్కడే. కళాభిరుచి మరింత ప్రగాఢమైంది. ఆ క్రమంలో ఆయన ప్రస్తావించే పేర్లు, కళారూపాలు వింటే అభిరుచి వున్నవారెవరైనా తలలూపకుండా వుండలేరు. వీలైనంత ఎక్కువమంది వ్యక్తులు, వారి పాత్ర పేర్కొనడం ఆయనలోని చరిత్రకారుణ్ని చూపిస్తుంది. 1952లో కమ్యూనిస్టుల ఘన విజయాలూ, 1955 మధ్యంతర ఎన్నికలు కమ్యూనిస్టు ప్రభుత్వ అవతరణపై ఆశలూ ఆశాభంగం.. ఆ పైన ఆంధ్ర యూనివర్సిటీలో రెండేళ్ల చదువు, విద్యార్థి ఫెడరేషన్ తరపున యూనియన్ ఎన్నికల్లో గెలుపు. సంరంభంగా సాగిన కార్యక్రమాలు, వచ్చిన అభ్యుదయవాదుల విశేషాలు ప్రతిదీ ఒక సినిమాలో ఫ్లాష్‌బ్యాక్‌లా సాగిపోతాయి. తర్వాత కావలి కాలేజీలోనే లెక్చరర్‌గా చేరడం ఒక ప్రత్యేకత. అప్పట్లో తన అధ్యాపకుడుగా వుండిన కెవి రమణారెడ్డి ఇప్పుడు బాగా సన్నిహితమయ్యారు. పెద్దగా తోడు నిలిచారు. ఈ పుస్తకంలో లలిత తర్వాత ఎక్కువగా కనిపించే పేరు ఆయనదే. ఆమె మొదటి కూతురు విద్యను మోస్తున్నపుడు విద్యా సంబంధమైన ఆహ్వానంపై వకుళాభరణం అమెరికా వెళ్లారు. అక్కడా ఇదేవిధమైన పరిశీలన. సిపిఎంలో నక్సలైట్ చీలిక వచ్చినపుడు కెవిఆర్ అటువైపు మొగ్గగా వకుళాభరణం రామకృష్ణ తటస్థంగా ఉండిపోయారు. అప్పుడున్న పరిస్థితుల్లో పార్టీలో చేరడం కన్నా తమ రంగంలో పనిచేస్తూ సహకరించడమే మంచిదన్న సుందరయ్య గారి సలహాతో బోధనా రంగంలోనే కొనసాగారు. ఆ సందర్భంగా ఒక జాతీయ సెమినార్‌లో గొప్ప చరిత్ర పరిశోధకురాలైన రొమిలా థాపర్ ఆయనను బిపిన్ చంద్రకు పరిచయం చేస్తే, ఆయన జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చేరాలని సూచించారు. తగు సలహాలూ ఇచ్చారు. ముగ్గురు పిల్లల తండ్రిగా బోలెడు బాధ్యతలు మోస్తున్న వకుళాభరణం భార్య ప్రోత్సాహంతో 1972లో ఢిల్లీ బయల్దేరారు.

జెఎన్‌యు కాలాన్ని గురించి వకుళాభరణం రాసిన అంశాలు మరింత ప్రత్యేకమైనవి. కేంద్రంలోని బిజెపి పాలకులు అదో దేశద్రోహ శిబిరంలా చిత్రించడానికి కారణమేమిటో కూడా అర్థమవుతుంది. బిపిన్‌చంద్ర, ఫణిక్కర్, సతీశ్‌చంద్ర, హర్బన్స్ ముఖియా, థాపర్, ఇంకా ఎందరో ఉద్ధండులు... భారతదేశ చరిత్ర అధ్యయానికి బాటలు వేసిన వారు. అవన్నీ గొప్పగావున్నా తిండితిప్పలు విషయంలో ఇబ్బందులు, థాపర్ సాయంతో ఒక తమిళ పరిశోధకుడికి తెలుగు చెప్పి రూ.200 తెచ్చుకోవడం. అక్కడ అధ్యయనం వినూత్న బోధనా పద్ధతులు, వామపక్ష వాతావరణం ఆయనను అమితంగా ఆకర్షించాయి. అక్కడ కందుకూరి వీరేశలింగం అండ్ హిజ్ టైమ్స్ ఎంఫిల్ థీసిస్ రాసి ఆ తర్వాత ఆపేద్దామనుకుంటే పెద్దల ఒత్తిడితో సర్వేపల్లి గోపాల్ పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక సంస్కరణ ఉద్యమాలు అన్న పిహెచ్‌డి పరిశోధన. ఇవి రెండూ కూడా తెలుగు వారి ప్రామాణిక గ్రంథాలుగా నిలిచిపోయాయి. ఈ సమయంలో పిల్లలను ఉద్యోగాన్ని చూసుకుంటూనే లలిత గారు కూడా లవణం హేమలత దంపతుల ప్రోత్సాహం సహాయంతో నేరస్త జాతులపై పరిశోధన పూర్తి చేశారు. విశేషమేమంటే కావలి జవహర్ భారతిలో లాగే జెఎన్‌యులో కూడా ఒక ఏడాది ఆయన బోధనా బాధ్యతలు నిర్వహించాల్సి రావడం. రెండేళ్ల తర్వాత ఆయన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రీడర్‌గా, తర్వాత ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఈ కాలంలో రాజకీయ పరిణామాలు తెలుగుదేశం అధికారంలోకి రావడం, కేంద్రంలో పరిణామాలు పొందుపర్చారు. ఈకాలంలో పాలనాపరంగానూ, విద్యారంగంలోనూ అనేక కొత్త సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. తన పరిశోధక విద్యార్థులతోనూ వామపక్ష సాంస్కృతిక ఉద్యమాలపై అధ్యయనం చేయించడానికి దోహదపడ్డారు. పదవీ విరమణానంతరం కొత్తగా స్థాపించిన నల్సార్ న్యాయ విద్యాలయాన్ని తీర్చిదిద్దడంలో భాగం పంచుకున్నారు. పూసల్లో దారంలా ఈ కాలమంతటా వచ్చిన రాజకీయ పరిణామాలు కూడా తన అభిప్రాయాలతో సహా రేఖామాత్రంగా చెప్పేశారు. మరో వైపున లలిత కలకత్తా విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి పూర్తి చేశారు. ఆమెకు తెలుగు అకాడమీలో ప్రత్యేక అవకాశం రావడంతో చాలాకాలం తర్వాత వారిద్దరూ ఒకేచోట వుండగలిగారు. నేరస్త జాతులు, దేవదాసి, మాతంగి, జోగిని వ్యవస్థ వంటి వాటిపై సాధికారిక గ్రంథాలు అందించారు. ఇంకా అనేక జీవిత చరిత్రలతో సహా నిరంతర వ్యాసంగం సాగిస్తూ వచ్చారు. 2010 నుంచి అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ 2017లో కన్నుమూయడం వకుళాభరణంకు తీరని వెలితిగా మిగిలింది. వకుళాభరణం పెద్ద కుమారుడు రాజగోపాల్.. వెల్చేరు నారాయణరావు పర్యవేక్షణలో స్వీయ చరిత్రలు వలస కాలపు ఆంధ్ర సమాజంపై పరిశోధన చేసి ప్రస్తుతం నాన్న పనిచేసిన హెచ్‌సియులోనే అధ్యాపకులుగా ఉన్నారు. రెండో కుమార్తె విద్య భాషాశాస్త్రం అభ్యసించారు. చిన్న కుమారుడు వంశీచరణ్ అర్థశాస్త్రంలో పిహెచ్‌డి. వీరూ ఉద్యమాలతో సంబంధం వున్నవారే.

ప్రకాశం జిల్లాలో ఎక్కడో మారుమూల పేద అర్చక కుటుంబంలో పుట్టిన వకుళాభరణం కుటుంబమంతా ఇంతటి అధ్యయన ప్రస్థానం సాగించడం, అందుకు లలిత గారు చూపిన దీక్షాదక్షతలు ఉత్తేజమిస్తాయి. ఇన్ని పరిస్థితుల మధ్యనా వారు ప్రగతిశీల లౌకిక వరవడిని చెక్కు చెదరనివ్వ కుండా చూడటం, రంజాన్ నాడు పుట్టిన మనవడికి ఇర్ఫాన్ అని పేరు పెట్టుకోవడం ఆకట్టుకుంటుంది. నాటి విద్యార్థులైన బివి రాఘవులు, మాజీ ఎంపి మాల్యాద్రి, శారద వంటి వారిని గుర్తు చేసుకోవడం, పరిశోధక శిష్యులు, సన్నిహితుల గురించి ఆర్ద్రంగా రాయడం వకుళాభరణంలో మానవీయ పార్శ్వాన్ని చూపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్‌లో ఆయన పాత్ర సుపరిచితమే! 1998లో పదవీ విరమణ తర్వాత రాష్ట్ర విభజన తెలంగాణ ఏర్పాటు వరకూ – మిత్రులు పరిశోధకుల సంస్థల ప్రోత్సాహంతో తెలుగు వారి సమగ్ర చరిత్ర ఎనిమిది సంపుటాలుగా ప్రచురించడం వకుళాభరణం కృషికి తారాస్థాయి.

ప్రగతిశీల మేధావుల ఆత్మకథలు తెలుగులో తక్కువే. వకుళాభరణం రామకృష్ణ అనుభవంతో అధ్యయనంతో జీవిత పోరాటంతో పండిన దశలో రాసిన ఈ జ్ఞాపకాలు, ఆయన భాష శైలి అన్నిటినీ మించి ఆయా దశల్లోని తన ఆలోచనలను ఘర్షణలను యథాతథంగా గుదిగుచ్చి నెమరేసుకోవడం చదువరులకూ అనుభూతినిస్తుంది. అనుకున్నవి సాధించడానికి, దాంపత్య జీవితంలో పరస్పరం సహకరించుకోవడానికి, సామాజిక నిబద్ధత నిలుపుకోవడానికి కూడా వకుళాభరణం రామకృష్ణ లలిత దంపతుల గాథ పఠనీయమవుతుంది.

– తెలకపల్లి రవి

# యువతరం కథా స్వరం

కొత్త శతాబ్దంలో రెక్క విప్పుకున్న నలభై మంది యువ రచయితల నలభై 'ఉత్తమ' కథల్ని యెంపిక చేసి వాటిని చదివి అభిప్రాయం చెప్పమని మిత్రుడు వేంపల్లి షరీఫ్ అడిగినప్పుడు– వాళ్లలో యెంతమంది కొత్తగా చెబుతున్నారు, యెంత మంది వర్తమానంలో నిలబడి భవిష్యత్తులోకి ఎక్కువ దూరం చూడగలుగుతున్నారు', వారి దృక్పథం యేంటి? యీ విషయాల మీదే యెక్కువ దృష్టి పెట్టాను. కొత్త శతాబ్దంలో సమాజం యెదుర్కొంటున్న సవాళ్లు యేమిటి, అవి సాహిత్యంలో యే మేరకు ప్రతిఫలిస్తున్నాయి, రచయితలు భిన్న సమూహాల జీవితాల్ని కేవలం యథాతథంగా చిత్రించడం దగ్గరే ఆగిపోతున్నారా, గుణాత్మకమైన మార్పుకు దోహదం చేసే చలనాన్ని తమ రచనల్లో విశ్లేషణాత్మకంగా. విమర్శనాత్మకంగా చూసి కళాత్మకంగా వున్నతీకరించగలుగుతున్నారా? వంటి అంశాల పైకే నా మనసు పోయింది.

సమాజంలాగానే సాహిత్యం కూడా నిత్యం చలనశీలంగా ఉండాలి. సాహిత్యకారుడు తాను జీవించే పరిసరాల్లో జరిగే మార్పుల్ని నిశితంగా పరిశీలించాలి. వాటికి కార్యకారణ సంబంధాన్ని మూలాల్లోకి వెళ్లి విశ్లేషించు కోవాలి. అభివృద్ధి నిరోధకమైనదాన్ని తిరస్కరించాలి. జీవితాన్ని మెరుగుపరచుకోడానికి దోహదం చేసే దారుల్ని ఆవిష్కరించుకోవాలి – అని బలంగా విశ్వసించే తరం నాది. సాహిత్య రచన సామాజిక ఆచరణ అని నమ్మే నా మాటలు కొత్త తరం రచయితల్లో కొందరికి రుచించకపోవచ్చు. సాహిత్య ప్రయోజనం – సామాజిక బాధ్యత – ప్రాపంచిక దృక్పథం వంటి మాటలు వారి చెవికి యింపుగా వినిపించకపోవచ్చు. అవి కాలం చెల్లిన ఆలోచనలుగా కూడా తోచవచ్చు. మరి కొందరు వొక దృక్పథం కలిగి వుండటమే సాహిత్య నేరంగా భావిస్తూ వుండొచ్చు. అనిబద్ధత దృక్పథ రాహిత్యం వుత్తమ సాహిత్య గుణాలుగా ప్రచారం చేసేవారు తక్కువేం కాదు. దృక్పథం సృజనాత్మకతకు ఆటంకంగా పరిణమిస్తుందని వాదించే వారు కూడా వున్నారు. నిజానికి దృక్పథం జీవితాన్ని అర్థం చేసుకుని రచనలో స్పష్టతని సాధించడానికి దోహదం చేసే అంశమే గాని అడ్డు కాదు.


దృక్పథ బలంతో, వస్తు రూప వైవిధ్యంతో రాస్తోన్న 'యువ' రచయితల చేతిలో తెలుగు కథ కొత్త పుంతలు తొక్కింది అని యీ సంకలనంలో కనీసం వొక డజను కథలన్నా రుజువు చేస్తాయి. ఆ విధంగా తెలుగు కథకి మంచి భవిష్యత్తు వుందని 'యువ' హామీ యిస్తుంది. మచ్చుకు వాటిలో కొన్ని మెతుకులు పట్టి చూద్దాం:

ఆధునిక భావజాలాలకి అనుగుణంగా పౌరాణిక పాత్రలతో పున:కథనాలు మనకు కొత్త కాదు గానీ బేతాళ పంచవింశతి కథలోని వొక పాత్ర తిరగబడితే, అది స్త్రీ పాత్ర అయితే, అన్న వూహతో చైతన్య పింగళి సంధించిన 'మనసిజ విల్లు' ... స్త్రీ పురుష శృంగార అనుభవంలో మనశ్శరీరాలు నిర్వహించే పాత్రపై నిశ్చిత నిశ్చయాలని ఛేదిస్తుంది. స్త్రీ మానసిక శారీరక అవసరాల్ని తమదైన కోణం నుంచి నిర్వచించి నిర్ధారించి శాసించే పురుషస్వామ్యంపై చెంపపెట్టు యీ కథ. సున్నితమైన హాస్యాన్ని సునిశితమైన వ్యంగ్యాన్నీ మేళవించి స్త్రీ లైంగికత చుట్టూ అల్లిన మిత్‌ని బద్దలుకొట్టడమే ప్రధాన కథాంశంగా స్వీకరించి దాన్ని నిర్వహించిన తీరు మెదడుకు గిలిగింతలు పెడుతూనే ఆలోచింపజేస్తుంది. వర్చ్యువల్ రియాలిటీ వికృత రూపాన్ని వినూత్న కథనంతో ఆవిష్కరించిన మరో కథ పూర్ణిమ తమ్మిరెడ్డి 'ఎడిట్ వార్స్'. యీ కథ రూపంలోనూ, సారంలోనూ అన్ని విధాలా అత్యాధునికమైనది. ది కార్వాన్ అన్న పత్రికలో ది ఎడిట్ వార్స్ పేరుతో వచ్చిన వాస్తవిక కథనాన్ని ఆధారం చేసుకుని... పూర్ణిమ సాంకేతిక రంగంలో తన అనుభవానికి సృజనాత్మకతని జోడించి యెంతో సంయమనంతో ప్రతీకాత్మకంగా కథ నిర్వహించింది. ప్రయోగం, దృక్పథం రెండూ యెటువంటి పొరపొచ్చాలు లేకుండా జంటగా సహజీవనం చేయగలవని చెప్పడానికి యీ కథ మంచి ఉదాహరణ.

స్త్రీ పురుష సంబంధాల్లో వస్తున్న మార్పుల్ని కొత్త రచయితలు యెలా చూస్తున్నారు – ప్రేమలు కలయికలు విడిపోడాలు ప్రీ, ఎక్స్ట్రా మ్యారిటల్ రిలేషన్స్, సహజీవనం, పెళ్లి, మల్టిపుల్ రిలేషన్స్ ... వీటి పట్ల స్థిరీకృతమైన విధి నిషేధాల విషయమై తమ కథల్లో యెలా స్పందిస్తున్నారు – యే విలువల్ని ప్రతిపాదిస్తున్నారు – యే ధోరణుల్ని వున్నతీకరిస్తున్నారు? ఇటీవల సాహిత్య చర్చల్లో ప్రధానంగా ముందుకు వస్తున్న ప్రశ్నలివి. (ఇన్ ద మూడ్ ఫర్ లవ్, నువ్వెళ్ళిపోయాకా, తొలిప్రేమ కథలు మొ. సంకలనాలు యీ చర్చని మరోసారి ముందుకు తెచ్చాయి). కాడ మల్లి (మెహర్), శీలానగర్ రెండో మలుపు (మిథున ప్రభ), మధురానగర్ మెట్రో స్టేషన్ (మొహమ్మద్ గౌస్), సీత కనబడింది (నాగేంద్ర కాశి), తన్మయి (ఉషాజ్యోతి బంధం), ఇంత సౌఖ్యమని ... (రవి మంత్రిప్రగడ), చెరువు – చింత చెట్టు (స్వాతికుమారి బండ్లమూడి), ఊర్మిలక్కతో సెక్స్ (చిన్ని అజయ్) .. యిలా యీ వస్తువుకి 'యువ' కథా సంకలనం లో కూడా సింహభాగమే లభించింది. వీటిలో మెహర్ 'కాడ మల్లి' గురించి ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. స్త్రీ పురుషుల మధ్య కలయిక బ్రేకప్ యెడబాటు యెంత హుందాగా గౌరవప్రదంగా ప్రజాస్వామికంగా వుండాలో తెలియజెప్పే యీ కథ నిర్మాణపరంగా సాంద్రంగా వుండటమే కాదు, గంభీరంగా కూడా వుంటుంది. కథలో మౌనం మాట్లాడుతుంది. దేహభాష పాత్రల అంతరంగాల్లోకి తొంగి చూసేలా చేస్తుంది. కథని ఆద్యంతం పరిమళభరితమైన ఓపెన్ స్టోరీగా నడపడం యెలాగో 'కాడ మల్లి'ని చూసి నేర్చుకోవచ్చు.

మాంత్రిక వాస్తవికత సామాజిక వాస్తవికత కలగల్సిన తన పూర్వీకుల కథ చెప్పి సరికొత్త కథకి పురుడు పోసిన యువ కథకుడు రమేష్ కార్తీక్ నాయక్. 'పురుడు' పరిణామంలో చిన్నదైనా వస్తుపరంగా రూపపరంగా శతాబ్దాల చరిత్ర సంస్కృతుల్ని పరిచయం చేసింది. జానపద మౌఖిక కథా శిల్పాన్ని సమకాలీన కథకి అన్వయించడం ద్వారా గొప్ప శిల్పాన్ని సాధించాడు రమేష్. మైనారిటీ అస్తిత్వ నేపథ్యం నుంచి వెలువడ్డ మానస ఎండ్లూరి 'ఒకరోజు', హుమాయూన్ సంఘీర్ 'హరామ్' కథలు యీ సంకలనానికి నిండుదనం తెచ్చాయి. మొదటిది దళిత క్రిష్టియన్ సంస్కృతిని మృదువైన హాస్యంతో విమర్శనాత్మకంగా పరిశీలిస్తే, రెండవది ముస్లిం మతంలోని విశ్వాసాల్ని మానవీయత గీటురాయి మీద హేతుదృష్టితో పరీక్షించింది. మత సామరస్యాన్ని బోధించే కథలు కొన్ని (షేక్ షబ్బీర్ హుస్సేన్: మా వూరి శివుడు, మేడి చైతన్య: సాయిబోల్ల పిల్ల) యీ సంకలనంలో చోటుచేసుకున్నాయి. అసహనం విద్వేషం పునాదిగా రాజకీయాలు నడుస్తున్న కాలంలో వాటి అవసరాన్ని సంపాదకుడు సరిగానే గుర్తించాడు.

40 యేళ్ల లోపు వాళ్లు అంటే మరీ అంత యువతే కాదు. కొందరు సీజన్డ్ రైటర్స్‌గా స్థిరపడ్డారు కూడా. కాబట్టి వాళ్లని యిప్పుడే కలంబట్టిన రచయితలుగా గుర్తించలేం. వాళ్ల చేతుల్లో కథ యెన్ని కొత్త పోకడలు పోయిందో గ్రహించడానికి పైన పేర్కొన్నవి కొన్ని తార్కాణాలు మాత్రమే. లోతుగా అధ్యయనం చేస్తే మరిన్ని దగంశాలు గోచరించవచ్చు.



ఈ సంకలనంలో చోటు చేసుకున్న కథలన్నీ వుత్తమమైనవేనా అంటే కాపోవచ్చు. కొన్ని కథలు కాబోయి కాలేకపోయినవీ, కొన్ని కథల చట్రంలోకి యిమడనివీ వుండొచ్చు. అయితే మూస బద్దలు కొట్టి కొత్తగా రాయాలనే తపన మాత్రం చాలామందిలో కనపడుతోంది. రూప ప్రయోగం చేయాలనే ఆలోచన కొందరిలోనైనా కనిపిస్తుంది. నిద్ర చావు అభావం వంటి మార్మిక జీవిత రహస్యాల్ని వ్యాఖ్యాన రహితంగా విలోమ అసిత్వ కథనంలో నిర్వచించిన ధీరజ్ కాశ్యప్ – డెఫినిషన్స్, ఆధునిక సాంకేతికతని సైన్స్ ఫిక్షన్‌లో మేళవించి మానవీయ విలువల్ని ప్రతిపాదించిన కుప్పిలి సుదర్శన్ – హెల్పింగ్ డోమ్, హిపోక్రసీ వంటి అమూర్త భావనని పాత్రగా రూపు కట్టించి మనిషిలోని స్వార్థాన్ని అక్షరాల్లోకి తర్జుమా చేసిన పాణిని జన్నాభట్ల – ఎయిత్ సిన్, ఆర్థికావసరాలకూ లైంగిక నైతికతకీ మధ్య యేర్పడే ఇన్ డీసెంట్ ఘర్షణని కొన్ని ఘటనల ద్వారా పాత్రల మనోగతం ద్వారా యాంటీ క్లైమాక్స్ ద్వారా బహిర్గతం చేసిన రిషి శ్రీనివాస్ – నిషిద్ధాక్షరాలు, ఆకస్మికతని దైనిక జీవితంలో యాంత్రికంగా మలచుకునే నగర ప్రేమని గ్లూమీగా చిత్రించిన మహమ్మద్ గౌస్ – మధురా నగర్ మెట్రో స్టేషన్, సంప్రదాయ కథా నిర్వచనాల్ని తిరస్కరించి ప్రీ మ్యారిటల్ రిలేషన్‌లోని బలమైన వుద్వే గాన్ని మ్యూజింగ్స్ రూపంలోకి మలచిన ఉషా జ్యోతి బంధం – తన్మయి కథల్లో చేసిన ప్రయోగాలు గమ నార్హం. ... అయితే యెటువంటి ప్రయోజనం లేకుండా కేవలం ప్రయోగం కోసమే ప్రయోగం చేయడం పట్ల రచయితలు అప్రమత్తంగా ఉండాలి. అవసరం మేరకు చేసే ప్రయోగం కథకి కొత్త ప్రాణం పోస్తుంది. ప్రయోగం సారాన్ని మింగేయకూడదు. ప్రయోగమే కథ కాకూడదు.

కథానుగుణమైన భాష వాడటంలో కొత్త రచయితలు అప్రమత్తంగా వున్నారు. తమ ప్రాంతీయ సామాజిక మాండలికాలని స్వేచ్ఛగా వుపయోగించుకుంటూ గడ్డం మోహన్ రావు, నస్రీన్ ఖాన్, ఉప్పులేటి సదయ్య, రమేష్ కార్తీక్ నాయక్, కందివనం స్ఫూర్తి, హుమాయూన్ సంఘీర్ (తెలంగాణా), ఇండ్ల చంద్రశేఖర్ (ఒంగోలు), మిథున ప్రభ (విశాఖ), సురేంద్ర శీలం (కర్నూలు) కె వి మేఘనాథ రెడ్డి (చిత్తూరు) వంటి రచయితలు వాడిన కథన భాష వారి కథలకి గొప్ప స్థానీయతనీ విశ్వసనీయతనీ సాధించింది. కథలో భాష పట్ల యువ కథకుల ప్రజాస్వామిక దృక్పథం చాలా హృదయస్పర్శిగా అనిపిస్తుంది. ఏది యేమైనా యివి యివాళ్టి కథలు. వర్తమాన కథా చరిత్రకి సాక్ష్యాలు. భవిష్యత్ కథ యీ రచయితల చేతుల్లో వుంది. ఈ కథల మంచి చెడ్డల నిర్ణయం విజ్ఞులైన పాఠకులదే.


**(40లో 40 కథల సంపుటి ముందుమాటలో కొన్ని భాగాలు)**

– ఎ.కె. ప్రభాకర్

# సంవేదన కలిగించే 'చిటికన వేలు...' కథలు

అనేక సాహిత్య ప్రక్రియల్లో లబ్ధ ప్రతిష్టుడైన రచయిత అట్టాడ అప్పల్నాయుడు ఇప్పటివరకూ 110 కథలు (6 సంపుటాలు), 5 నవలలు (ఇటీవల వచ్చిన 'బహుళ' ఉత్తరాంధ్ర జీవన నేపథ్యంతో వచ్చిన బృహత్ నవలగా విమర్శకుల ప్రశంసలకు నోచుకుంది), 3 నాటకాలు (వంద తెలుగు ఉత్తమ నాటకాల సంకలనంలో ఆయన 'మడిచెక్క' చోటు దక్కించుకుంది), 3 నాటికలు (రేడియో), ఒక కాలమ్ (నేస్తం ఊసులు వ్యాస సంపుటి) వెలువడ్డాయి. ఇవికాక సందర్భోచితంగా అనేక అంశాల మీద ఆయన రాసిన వ్యాసాలు అనేకం.

అట్టాడ తన రచనలన్నిటా ఉత్తరాంధ్ర ప్రజల జీవద్భాషను అద్భుతంగా వినిపిస్తారు. యాసను, సంభాషణల్లో పలికే ఇకటాన్ని పవర్ స్ప్రేయర్‌లా పాఠకుల మెదళ్ళలోకి ఎంతో సాంద్రంగా పిచికారీ చేస్తారు. గత ఆగస్టులో జరిగిన ఆయన సప్తతి ఉత్సవంలో ఆయన సరికొత్త కథా సంపుటి 'చిటికెన వేలు' ఆవిష్కరణ జరిగింది. రచయితకు జన్మదిన కానుకగా దీనిని ఛాయా రిసోర్సెస్ సెంటర్ నిర్వాకులు మోహన్‌బాబు తమ సంస్థ ద్వారా ముద్రించారు. ఈ సంపుటిలో వస్తు వైవిధ్యత కలిగిన 18 కథలున్నాయి. ఒక కథకుడు విభిన్నమైన వస్తువులను పట్టుకోవడం ఒక ఎత్తైతే, వాటిని అంతే సమర్థవంతమైన కథలుగా మల్చడం మరొక ఎత్తు. ఈ రెండు విషయాల్లోనూ అప్పలనాయుడు చెయ్యి తిరిగిన రచయిత. ఈ సంపుటికి శీర్షికగానూ, పుస్తకంలో ఆఖరి కథ గాను వున్న 'చిటికెన వేలు' ఓ ఆసక్తికరమైన కథ. మహాభారత కాలంలో గిరిజన యోధుడు ఏకలవ్యుడు, ఉన్నత వర్గాలకు చెందిన గురుశిష్యుల కుట్రకు బలవుతాడు. గురువే కాని గురువు గురుదక్షిణ పేరుతో యాచించడంతో తన కుడిచేతి బొటనవేలిని తనే కోసి ఇస్తాడు. ఈ కథలోనూ కొంచం అటూ ఇటుగా అదే జరిగింది.



ఇటికి జమీందార్ తన జమీలోని గిరిజనులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను వారి తిండికి కూడా లేకుండా వారితోనే తన ఇంటికి మోయించుకు పోతుంటాడు. వారి స్త్రీలను చెరపడతాడు. ఈ ఆగడాలను సహించలేని మల్లయ్య బాధితులందరినీ కూడగట్టి జమీందర్ మీద తిరుగుబాటు చేస్తాడు. జమీందార్ ఆంగ్లేయుల సాయంతో ఆ తిరుగుబాటును అణిచివేసి, మల్లయ్యను ఉరి తీయిస్తాడు. స్వాతంత్ర్యానంతరం సర్కారు వారి డిపార్ట్‌మెంట్ల మనుషులు, పల్లం నుంచి వచ్చిన వర్తకులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై గిరిజనులను పీడిస్తుంటారు. ఆ పీడనకు వ్యతిరేకంగా సోమన్న దొర సాయుధుల్లో కలిసిపోయి రాజ్యం మీద తిరుగుబాటు చేస్తాడు. పోలీసులు అతడి కోసం వేట మొదలు పెడతారు. తమ సౌలభ్యం కోసం ఆ ఇటికి గూడ పేరును సోమన్న గూడగా మార్చేస్తారు. సోమన్న దొర పోలీసులకు దొరికిపోయి కొన్నేండ్లు జైలుకెళ్ళి వస్తాడు. అప్పటికి ఊరి తీరు పూర్తిగా మారిపోతుంది. వ్యాపారులు రకరకాల పద్ధతుల్లో గిరిజనులకు కొత్త కొత్త అలవాట్లు నేర్పించి అప్పులపాలు జేశారు. ఆఫీసర్లు సోమన్న గూడను యస్జీ గూడ గాను, దానికి దగ్గర్లోనే ఉండే గెడ్డను ఫాల్స్ గాను మార్చి... ఆ ప్రాంతాన్ని యస్జీ ఫాల్స్ పేరిట పెద్ద టూరిస్ట్ సెంటర్‌గా మార్చేస్తారు. వ్యాపారులు గిరిజనుల భూముల్ని కొనేస్తారు. సోమన్న దొర ఒక్కడూ తన భూమిని అమ్మనని భీష్మిస్తాడు. అధికార్లు, వ్యాపారులు కుమ్మక్కయ్యి అతని కొడుకు బుధడి ద్వారా సోమన్న దొర లొంగివచ్చేలా చేస్తారు. భూమిని అమ్మిన సోమన్న దొర కొడుకుతోపాటు స్టాంప్ పేపర్ల మీద సంతకం పెట్టి .. ఆ కాగితాలతోపాటు తన చిటికెన వేలిని కోసి పేపర్లో చుట్టి ఇస్తాడు. విస్తుబోయిన అధికారులు 'ఇదేంట'ని ప్రశ్నిస్తారు. దానికతను 'మా తాత ముత్తాతల కాలం నుంచి నా తరందాకా మేమంతా మా తండ్రుల చిటికెన వేళ్ళు పట్టుకుని వాళ్ళ అడుగుల్లో అడుగులు వేస్తూ ముందుకు సాగాం. మీ కుట్రల కారణంగా మా పిల్లలకు భూములతో సంబంధాలు తెగిపోయాయి. మమ్మల్ని మాలాగ బతకనివ్వకుండా చేశారు. ఇప్పుడు నాకీ చిటికెనవేలితో పనిలేదు. అందుకే నా అంతట నేనే దానిని కోసుకుని మీకు కానుకగా ఇస్తున్నాను' అంటాడు. ఇదీ కథ. పాఠకులు ఉలిక్కిపడేలా, అన్యాయాన్ని ఎత్తిచూపేలా మలిచిన తీరు ఎంతో గొప్పగా ఉంటుంది.

సంపుటిలో మొదటి కథ 'భౌ.. భౌ .. భౌ..'. ఇందులో గౌరీశ్వరి... వీధులెంట కాగితాలు ఏరి అమ్ముకుంటూ పొట్టపోసుకునే కుటుంబంలోని అమ్మాయి. ఆ అమ్మాయిని వల్లో వేసుకోవాలనే ఆలోచనతో పెళ్ళి చేసుకుందామంటూ, ఊరి సర్పంచ్ పెంపుడు కుక్క లాంటి సింహాచలం చేసే వ్యవహారాలన్నింటినీ చూపించుకుంటూ వచ్చిన కథకుడు... చివరికొచ్చేసరికి గౌరీ వాళ్ళ ఊరు మొత్తాన్ని సర్పంచ్ వాళ్ళు కబ్జా చెయ్యడానికి ఎత్తు వెయ్యడాన్ని, ఊర కుక్కల మూకుమ్మడి దాడికి సర్పంచ్ సీమకుక్కలు పలాయనమైపోవడాన్ని చెబుతారు. సాధారణ జనం తిరగబడితే ఎంతటి వాడైనా అంతిమంగా తోక ముడవాల్సిందేనన్న నగ్న సత్యాన్ని ఈ కథలో చూపిస్తాడు. అధికారం, డబ్బు, హోదా ఉన్నాయి కదాని పేదల జోలికి వస్తే... అదీ వారి మౌలిక అవసరాలైన కూడు, గూడు కొల్లగొట్టాలని చూస్తే.. పెను పామును చంపే చలి చీమల్లా తిరుగుబాటు చేస్తారంటూ కథను పతాకస్థాయికి తీసుకుపోతాడు. ఇక్కన్నుంచి కథాగమనం ఎలా వుండాలో మీరే ఊహించండి అన్నట్టు పాఠకుల మెదళ్ళకు పని కల్పిస్తాడు.

మరో మంచి కథ 'దెయ్యపు భరోసా'. ఇవ్వాళ రాజకీయ నాయకుల భరోసా దెయ్యాలిస్తున్న భరోసాల్లా అన్పిస్తున్నాయి తప్ప నాయకులిస్తున్నట్టుగా లేవు అన్న ఎరుకను అందిస్తుంది. మనచుట్టూ ఏం జరుగుతుందో ఒక్కసారి ఆలోచించండి అంటూ అప్రమత్తం చేసే కథ 'పితలాటకం'. ఇప్పుడున్న స్వార్థ పార్టీల దొంగాటకంలో దేశప్రజలు ఎలా నలిగిపోతున్నారో కళ్ళకు కట్టినట్టు చెబుతుంది. భగవంతుడికి కూడా తెలియకుండా భాగ్యవంతుడు పేదవాళ్ళ బతుకుల మీద యెక్కి తొక్కి తొక్కి కుమ్మేస్తున్న వైనాన్ని 'పిడికిలి' కథలో వివరించారు.

ఇలా సంపుటంలోని ప్రతి కథా అట్టడుగు ప్రజల కడగండ్ల పట్ల సానుభూతితో, వర్గ స్పృహతో చెప్పినదే! అవినీతి, ఆశ్రిత పక్షపాత నాయకుల, భూ కబ్జాదార్ల, అవినీతిపరులైన అధికార్ల మీద సంధించిన ఫిరంగి గుండ్ల లాంటి కథలివి. కమ్యూనిస్టు పార్టీల చీలిక వల్ల ఈ దేశ రాజకీయాలకు, సామాన్యులకు, శ్రామికవర్గానికి ఎంత నష్టం జరిగిందో, జరుగుతుందో, జరగనుందో అంటూ కథకుడు అప్పల్నాయుడు వెలిబుచ్చిన ఆవేదన ఎన్నో కథల్లో వినబడుతుంది. సామాజిక ప్రయోజనం గల ఇలాంటి కథలు అట్టాడ గారి కలం నుంచి ముున్ముందు మరిన్ని రావాలి!

– శిరంశెట్టి కాంతారావు
98498 90322

## మోడీ సర్కార్‌కు 'ఉపాధి' పట్టదు : కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమాత్రం పట్టవని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఆమ్‌ఆద్మీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం నుంచి ప్రజలను రక్షించే ఉద్దేశ్యం కేంద్ర ప్రభుత్వానికి లేదని ఆయన విమర్శించారు. దేశం నుంచి పారిశ్రామిక వేత్తలు, ఎక్కువ సంపద ఉన్న ప్రజలు వెళ్లిపోతున్నారని, దానికి కారణం బిజెపి ప్రభుత్వమేనని ఆయన అన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలేవీ మోడీ సర్కార్ చేపట్టడం లేదన్నారు.

## ప్రారంభం కాకుండానే కుప్పకూలిన వంతెన

- రూ.13.43 కోట్లతో నిర్మాణం
- బీహార్‌లో ఘటన

**పాట్నా :** గుజరాత్‌లోని మోర్బీలో నాసిరకపు మరమ్మతులతో వంతెన కుప్ప కూలి 150 మంది పైగా చనిపోయిన విషాద ఘటన మరువకముందే బీహార్‌లో మరో వంతెన కుప్పకూలింది. అయితే అది ప్రారంభానికి కూడా నోచుకోకముందే కుప్పకూలడంతో ప్రాణ నష్టం జరగలేదు. గండక్ నదిపై 206 మీటర్ల పొడవైన ఈ వంతెనను రూ.13.43 కోట్ల వ్యయంతో 2017లోనే నిర్మాణం పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో ఇప్పటి వరకు ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో ఆ వంతెన ఆదివారం ఉదయం కుప్పకూలింది. నాబార్డ్ పథకం కింద ఈ వంతెన నిర్మాణ పనులను 2016లో ప్రారంభించి ఏడాదిలో పూర్తి చేశారు. భారీ మొత్తం ఖర్చు చేసి వంతెన నిర్మాణం చేపట్టినా వినియోగంలో లేకపోవడంతో పగుళ్లు ఏర్పడ్డాయని, కొద్దిరోజుల క్రితమే 2, 3వ నంబర్ల స్తంభాల వద్ద పగుళ్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు దీనిపై ఉన్నతాధికారులకు లేఖలు కూడా రాసినట్లు తెలుస్తోంది. ఇంతలోనే ఈ వంతెన ముందు భాగం నదిలో కుప్పకూలిపోయింది. సాహెబ్‌పూర్ కమల్ పోలీస్‌స్టేషన్ ప్రాంత పరిధిలోని ఆకెరి టోలాకి, బిష్ణుపూర్ నుంచి అహొక్ గండక్ ఘాట్ వైపు ఈ వంతెన నిర్మించారు. కాగా ఈ ఘటనపై లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ పాశ్వాన్) నేత సంజయ్ కుమార్ యాదవ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. వంతెన నిర్మాణంలో భారీ అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు.

# కోరలు చాచిన నిరుద్యోగం

**'రోజ్‌గార్' పేరిట మోడీ సర్కార్ ప్రచారార్భాటాలు**

- డిసెంబర్ 16 నాటికి 9.3 శాతం నిరుద్యోగ రేటు
- సిఎంఐఇ నివేదికలో వెల్లడి

**'నేను పనిచేస్తున్న కంపెనీ ప్రధాన కార్యాలయం బెంగుళూర్‌లో ఉంది. ఐటీ కంపెనీలన్నీ ఇటీవల పెద్ద ఎత్తున సిబ్బందిని తొలగించాయి. నేను పనిచేసిన కంపెనీ ఏకంగా మూతపడింది. నాతో సహా వందలాది మందికి 8 నెలల జీతం బాకీ ఉంది. కేంద్ర కార్మిక మంత్రి, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రికి, బిజెపి నాయకులకు ఫిర్యాదు చేశాం. మా గోడు వినే నాథుడే లేడు'.. ఉద్యోగం కోల్పోయిన ఓ వ్యక్తి సందేశం ఇది. సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది.**



పంజాబ్‌లో ధర్నా చేస్తున్న నిరుద్యోగులు (ఫైల్)

**న్యూఢిల్లీ :** ఉపాధి సంక్షోభం తీవ్రరూపం దాల్చుతోంది. ఉన్నత చదువులు పూర్తిచేసినవారు, నైపుణ్యాలు ఉన్నవారికి ఉపాధి దొరకడం లేదు. అంతేగాక పెద్ద పెద్ద కంపెనీల్లో పనిచేస్తున్న 35 నుంచి 43 ఏళ్ల వయస్సున్న వారూ నిరుద్యోగులుగా మారుతున్నారు. ట్విట్టర్, ఫేస్‌బుక్, యూట్యూబ్ లలో తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. దేశంలో నిరుద్యోగిత రేటు ప్రతినెలా పెరుగుతూనే ఉంది. కరోనా సంక్షోభ పరిస్థితులు తగ్గుముఖం పట్టినా..ఉపాధి మాత్రం మెరుగుపడటం లేదు. డిసెంబర్ 16 నాటికి భారత్‌లో నిరుద్యోగ రేటు 9.3 శాతానికి చేరుకుందని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' (సిఎంఐఇ) తాజాగా గణాంకాలు విడుదల చేసింది. ఈ సంస్థ దేశవ్యాప్తంగా నిరంతరం పీరియాడిక్ శాంపిల్ సర్వేలు చేపడుతోంది. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థలో ఉపాధి తీరు అత్యంత నిరుత్సాహంగా ఉందని, ఉపాధి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నవారిలో కొంతమందికైనా ఉద్యోగ అవకాశాలు దక్కడం లేదని నివేదిక తెలిపింది. కరోనాకు ముందునాటి 2019తో పోల్చితే నిరుద్యోగుల సంఖ్య మరింత పెరిగిందని తెలిపింది.

**ప్రకటనలకు పరిమితం**

దేశవ్యాప్తంగా కార్మికరంగంలో నవంబర్, 2022నాటికి 40.18 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. కరోనా సంక్షోభం కంటే ముందు నవంబర్, 2019లో ఉపాధిపొందేవారి సంఖ్య 40.3 కోట్లు. గత మూడేళ్ళుగా ఉపాధి రంగం స్తబ్దుగా ఉండిపోయిందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. కార్మికరంగంలో ప్రవేశించాలని ఎంతోమంది తాపత్రయ పడుతున్నా, వారికి సరైన ఉపాధి లభించడం లేదని తెలుస్తోంది. నిరుద్యోగం తీవ్రరూపం దాల్చుతోందని ప్రతిపక్షాలు, యువత ఆందోళనలు చేపడుతున్నప్పుడల్లా, ఉద్యోగాల భర్తీపై బిజెపి నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. 10 లక్షల ఉద్యోగ ఖాళీలు (రోజ్‌గార్ మేళా) చేపడుతున్నామని ఈ ఏడాది జూన్‌లో ప్రధాని మోడీ స్వయంగా ప్రకటించారు. కేంద్రంలోని అన్నిశాఖల్లోనూ నియామకాలుంటాయని తెలిపారు. కొద్ది రోజులు గడిచాక..మళ్లీ అంతా మామూలే. ఆందోళనలు, నిరసనలు, యువత ఆగ్రహాన్ని చల్లార్చడానికి ఇదొక ఎత్తుగడగా మారిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**రోజ్‌గార్ మేళా ఆర్భాటం**

ప్రధాని మోడీ ప్రకటించిన 'రోజ్‌గార్ మేళా' ప్రచార ఆర్భాటంగా మిగిలిపోయింది. దేశంలో మౌలిక వసతుల కల్పన ప్రాజెక్ట్ ద్వారా ఉద్యోగాల కల్పన చేశామని ప్రధాని మోడీ మాట్లాడుతున్నారు. ప్రయివేటు రంగంలో ఉపాధి, స్వయం ఉపాధి పొందుతున్నవారి లెక్కలు 'రోజ్‌గార్ మేళా'లో వేస్తున్నారు. వారు ఉపాధి పొందటం తన ఘనతగా చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నా, అధిక ధరలు వేధిస్తున్నా..ప్రధాని మోడీ మాత్రం నోరు మెదపటం లేదు. కఠినమైన మౌనం పాటిస్తున్నారు. దేశంలో బడా కార్పొరేట్ల వ్యాపారాలు, వాణిజ్యం పుంజుకున్నాయి. పెద్ద పెద్ద సంస్థల లాభాల మార్జిన్ ఎన్నోరెట్లు పెరిగింది. అయితే ఇదంతా ఉపాధి రహిత వృద్ధిగా నిపుణులు చెబుతున్నారు. అందువల్లే దేశంలో అసమానతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయని అన్నారు. స్టాక్‌మార్కెట్‌లో లిస్టెడ్ కంపెనీల లాభాల వృద్ధిని ఆర్థిక వృద్ధిగా భావించలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పెరుగుతున్న నిరుద్యోగరేటు**

2019లో కార్మికరంగంలో ఉపాధి పొందేవారి సంఖ్య 44.2 కోట్లుగా ఉంది. ఇది 2020లో 42.4 కోట్లకు పడిపోయింది. అటు తర్వాత 2021లో 43.5 కోట్లు, 2022లో 43.7 కోట్లకు చేరుకుంది. ఈ మధ్యకాలంలో డిగ్రీలు, ఉన్నత చదువులు పూర్తిచేసుకున్న కొత్తవారెంతో మంది ఉపాధి వేటకు బయల్దేరారు. 2019లో 7.4 శాతం నుంచి 2020కి 25 శాతానికి పెరిగింది. అటు తర్వాత 10శాతానికి రాగా, నవంబర్‌లో (నెలవారీ సగటు) 7.5 శాతం నమోదైంది. 30 రోజుల సగటు లెక్కలోకి తీసుకుంటే, డిసెంబర్ 1న 8.2 శాతం ఉండగా, డిసెంబర్ 16న 9.3 శాతం ఉందని నివేదిక గణాంకాలు విడుదల చేసింది. ఇక పట్టణాల్లో నిరుద్యోగరేటు 9.7 శాతం దాటిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ 9 శాతంపైన్నే ఉంది. డిసెంబర్ 2021లో దేశంలో నిరుద్యోగరేటు 7.9 శాతం ఉందని లెక్క తేలింది.

## ఇంధన ట్యాంకర్ పేలుడుతో ఆఫ్ఘనిస్థాన్‌లో 19 మంది మృతి

**కాబూల్ :** ఆఫ్ఘనిస్థాన్‌లో ఒక సొరంగంలో ఇంధన ట్యాంకర్ పేలుడుతో 19 మంది మరణించారు. మరో 32 మంది తీవ్రంగా గాయపడ్డారు. రాజధాని కాబూల్‌కు ఉత్తరంగా 80 మైళ్ల దూరంలో శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదు. గాయపడ్డవారి పరిస్థితి విషమంగా ఉందని, మృతులు సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌లో ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలపడంలో కీలకంగా ఉండే ఈ సొరంగ మార్గంలో ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ పూర్తిగా స్థంభించిపోయింది.



## మిసెస్ వరల్డ్ విజేతగా సర్గమ్ కౌశల్



**లాస్ వేగాస్ :** దాదాపు 21 ఏళ్ల తర్వాత మిసెస్ వరల్డ్ పోటీల్లో భారత్‌కు చెందిన మహిళ విజేతగా నిలిచారు. అమెరికాలోని లాస్‌వేగాస్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో 63 దేశాల మహిళలు పాల్గొన్నారు. జమ్ముకాశ్మీర్‌కు చెందిన సర్గమ్ కౌశల్ విజేతగా నిలిచారు. ఆమెకు 2021లో మిసెస్ వరల్డ్ విజేత షాయలిన్ ఫోర్డ్ (అమెరికా) కిరీటాన్ని బహుకరించారు. మిసెస్ పాలినేషియా తొలి రన్నరప్‌గా.. మిసెస్ కెనడా రెండో రన్నరప్‌గా నిలిచారు. దాదాపు 21-22 ఏళ్ల తర్వాత భారత్‌కు మళ్లీ కిరీటం వచ్చిందనీ, తనకు చాలా ఆనందంగా ఉందని సర్గమ్ కౌశల్ అన్నారు. వివాహిత మహిళల కోసం ఈ పోటీలను 1984 నుంచి నిర్వహిస్తున్నారు. 2001లో భారత్‌కు చెందిన డాక్టర్ అదితీ గోవిత్రికర్ తొలిసారి ఈ కిరీటాన్ని దక్కించుకున్నారు.





# కుల దురహంకారం కాటేస్తోంది!

- వందలాది మంది ప్రాణాలు బలిగొంటోంది
- సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ ఆందోళన

**న్యూఢిల్లీ :** దేశంలో కుల దరహంకార జాఢ్యం ప్రమాదకర సమస్యగా మారిందని భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రతి యేటా వందల సంఖ్యలో యువకులు బలైపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రేమ వివాహాలు, కులాంతర వివాహం చేసుకోవడం, వారి కుటుంబ ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకోవడంతో దురహంకార హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. మాజీ అటార్నీ జనరల్ అశోక్ దేశాయ్ 90వ జయంతి సందర్భంగా ముంబయిలో శనివారం జరిగిన 'లా అండ్ మోరాలిటీ' కార్యక్రమంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..నైతికతతో ముడిపడిన బ్రెస్ట్ ట్యాక్స్, స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించే 377 సెక్షన్, ముంబయి బార్ డ్యాన్స్‌పై నిషేధం, వ్యభిచారం తదితర కేసులు గురించి ప్రస్తావిస్తూ లీగల్ న్యూస్‌వెబ్‌సైట్ 'బార్ అండ్ బెంచ్' రాసిన కథనాన్ని ఆయన ఉటంకించారు. దాని ప్రకారం..పెత్తందారి సామాజిక తరగతులు, సము హాలు.. బలహీన తరగతులు, తెగలపై ఆధిపత్యం చలాయించేందుకు ఉద్దేశించిన ప్రవర్తనా నియమావళే 'నైతికత'గా చలామణి అవుతోందన్నారు. 'నాకు ఏది నీతి అనిపిస్తుందో.. ఆ నైతికత మీకుండాల్సిన అవసరం ఉందా?' అని ఆయన ప్రశ్నించారు.



1991లో ఉత్తరప్రదేశ్‌లో 15 ఏళ్ల బాలికను ఆమె తల్లిదండ్రులు ఎలా చంపారో విశ్లేషించే ఒక కుల దురహంకార హత్యకు సంబంధించిన కథనాన్ని ఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. వారి ప్రకారం బాలిక సమాజానికి వ్యతిరేకంగా అడుగు పెట్టిందని, దానిని గ్రామస్థులు నేరంగా పరిగణించారని తెలిపారు. గ్రామస్తులు నేరాన్ని అంగీకరించారని ఆ కథనం పేర్కొంది. వారు నివసించిన సమాజంలోని ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉన్నందున వారి చర్యలు (వారికి) ఆమోదయోగ్యమైనవని.. ఆ చర్యలు సమర్థించుకున్నారని తెలిపారు. బలహీనమైన, అట్టడుగు సామాజిక తరగతులకు చెందిన ప్రజలు..ఆధిపత్య సమూహాలకు లొంగిపోవలసి వస్తుందనీ ఆందోళన వ్యక్తం చేశారు. అణచివేత కారణంగా వారు ప్రత్యామ్నాయ సంస్కృతిని అభివృద్ధి చేయలేరని సిజెఐ ఆవేదన వ్యక్తం చేశారు. అట్టడుగు తరగతుల ప్రజలు తమ మనుగడ కోసం ఆధిపత్య సంస్కృతికి లొంగిపోవడం తప్ప మరో మార్గం లేకపోయిందని, దీనిని అధిగమించాల్సిన అవసర ముందని తెలిపారు. ఆధిపత్య కులాల చేతిలో బలహీన తరగతులకు చెందిన ప్రజలు అనేక అవమానాలకు, నిత్య దోపిడీకి గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. శక్తిమంతులు ఏం నిర్ణయం తీసుకుంటారో అది నైతికతగా పరిగణించే దుర్మార్గం కొనసాగు తోందన్నారు. ప్రస్తుతం యువత తమ కులానికి వ్యతిరేకం గా ప్రేమించడం లేదా పెళ్లి చేసుకోవడం కారణంగా కుల దురహంకార హత్యలకు బలైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రసంగంలో స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించని సుప్రీంకోర్టు తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు. న్యాయాన్ని సరిదిద్దాం. రాజ్యాంగ నైతికత వ్యక్తుల హక్కులపై దృష్టి పెడుతూ...సమాజంలో నైతికతను కాపడుతుందని ఆయన తెలిపారు.

## తొలి కేబినెట్ సమావేశంలోనే ఒపిఎస్‌కు ఆమోదం

- హిమాచల్ ప్రదేశ్ సిఎం సుఖ్వీందర్ వెల్లడి
- బిజెపికి ఫిరాయింపులుండవని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ ఉద్యోగులకు పాత ఫించను విధానం (ఒపిఎస్) విధానాన్ని పునరుద్ధరించడంపై తొలి మంత్రివర్గ సమావేశంలోనే కచ్చితంగా నిర్ణయం తీసుకుంటామని హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు తెలిపారు. మంత్రివర్గ విస్తరణ త్వరలోనే జరుగుతుందని, ఆ తర్వాత జరిగే తొలి కేబినెట్ సమావేశంలోనే ఒపిఎస్‌కు ఆమోదముద్ర వేస్తామని ఆయన చెప్పారు. హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్‌లో అంతర్గత పోరు అంటూ వస్తున్న కథనాలపై ఆయన ఆదివారం నాడు మీడియాతో మాట్లాడారు. అలాంటి అంతర్గత పోరు కాంగ్రెస్‌లో లేదని, అయితే కేవలం ముగ్గురు-నలుగురు మధ్య ముఖ్యమంత్రి పీఠం కోసమే పొరపొచ్చాలు జరిగాయని ఆయన తెలిపారు. అలాగే, ఏదైనా తప్పు జరిగితే 'రాజస్థాన్ తరహా పరిస్థితే' ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా బిజెపిలోకి ఫిరాయించబోరని, ప్రజల కోసం పని చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## పుదుచ్చేరి-జఫ్నా మధ్య వచ్చే నెల నుంచి ఫెర్రీ సర్వీసెస్

**కొలంబో :** 2023 జనవరిలో పుదుచ్చేరి, జాఫ్నా జిల్లాలోని కకేసంతూరీ పోర్టు మధ్య ప్రయాణీకుల ఫెర్రీ సర్వీసెస్‌ను భారత్-శ్రీలంక ప్రారంభించనున్నాయి. ఈ మేరకు శ్రీలంక పోర్టులు, షిప్పింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి నిమల్ సిరపళ డిసిల్వా తెలిపారు. ఈ సర్వీసెస్‌కు భారత ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. జాఫ్నా ద్వీపకల్పంలో భారీ సంఖ్యలో భారతీయులు వ్యాపారాలు చేస్తున్నారని, వీరితో పాటు, బౌద్ధ యాత్రికులకు కూడా ఈ సర్వీసెస్ చాలా ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి చెప్పారు. అలాగే, దక్షిణ భారతదేశం నుంచి శ్రీలంకలోని ట్రిన్‌కోమలీ, కొలంబో మధ్య కూడా ప్రయాణీకుల రవాణా సర్వీసెస్‌ను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఇరు దేశాలకు చెందిన ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ మేరకే ఫెర్రీ సర్వీసెస్‌పై నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

## ఆందోళనలకు మద్దతుగా పోస్ట్.. ఇరాన్‌లో ప్రముఖ నటి అరెస్ట్



**టెహ్రాన్ :** ఇరాన్‌లో ఆందోళనకారులపై అణచివేతలు కొనసా గుతున్నాయి. తాజాగా హిజాబ్ వ్యతిరేక ఆందోళనలకు సంఘీభావం ప్రకటిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ చేసిన ప్రముఖ నటి అలి దూస్తీని ఇరాన్ పోలీసులు శనివారం అరెస్టు చేసినట్లు స్థానిక మీడియా ఆదివారం తెలిపింది. అలిదూస్తీ నటించిన చిత్రం 'ది సేల్స్‌మ్యాన్' ఆస్కార్‌కు కూడా ఎంపికైంది. ఆందోళనలో పాల్గొన్న ఓ వ్యక్తిని శాంతి భద్రతలకు విఘాతం కలిగించారంటూ ఇరాన్ ప్రభుత్వం అతనిని ఉరితీసింది. అతనికి సంఘీభావం తెలుపుతూ అల్‌దూస్తీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. 'అతని పేరు మొహసేన్ షెకారి. ఈ రక్తపాతాన్ని చూస్తూ చర్యలు తీసుకోకుండా నిస్సహాయంగా చూస్తున్న ప్రతి అంతర్జాతీయ సంస్థలు చర్యలు తీసుకోకపోవడం మానవత్వానికి అవమానకరం ' అని ఆమె పోస్ట్ చేశారు. అయితే ఆదివారం అలిదూస్తి ఖాతా కూడా సస్పెండ్ చేశారు. ఆమె వాదనలకు అనుగుణంగా ఎటువంటి పత్రాలను అందించక పోవడంతో ఆమెను అరెస్ట్ చేసినట్లు ఇరాన్ ప్రభుత్వం తెలిపింది.



## మీకోసం

చెక్క చెంచాలు, గరిటెలు వాసన వస్తుంటే వాటిని కొద్దిసేపు వెనిగర్ కలిపిన నీటిలో ఉంచి వాడుకోవాలి.

## జీవన సౌరభం

నిత్యం పనిచేసే శ్రామికుడిని చూసి ఓటమి భయపడుతుంది.



## నా మౌనానికి సవ్వడొచ్చింది

తొమ్మిది నెలల
అమ్మ గర్భగుడి నుంచి
కన్నా పేగు బంధం
తెంచుకొని బయటికొచ్చి
అమ్మని చూడగానే
నా మౌనానికి సవ్వడొచ్చింది !!

అమ్మ చనుబాలు
తీపి రుచి చూడగనే
అమ్మ చేతి గోరుముద్ద తినగానే
అమ్మ మాట
జోలపాటవినగానే
నా మౌనానికి సవ్వడొచ్చింది !!

నేను బడికెళ్లే టప్పుడు
నా అరచేతిలో రూపాయి
బిళ్ళ పెట్టినప్పుడు
నన్ను భుజాలపై
తీకుకొని బడిలో
విడిచి పెట్టినప్పుడు
నా మౌనానికి సవ్వడొచ్చింది !!


అమ్మతో,నాన్నతో
అక్కతో,అన్నతో
ఆటలు ఆడుకొన్నప్పుడు
పాటలు పాడుకొన్నపుడు
నా మౌనానికి సవ్వడొచ్చింది !!

నేను ఆటలో
ఓడిపోయినప్పుడు
నేను వీధిలో
కాలుజారి పడినప్పుడు
నేను ఉన్నాను ఆడు
నేను ఉన్నాను నడువు
అని నాతో ....
నాన్న అన్నప్పుడు
నా మౌనానికి సవ్వడొచ్చింది !!


- లక్ష్మీశ్రీనివాస్
పలమనేరు
96766 01192

## బొమ్మ గీయండి!

చిన్నారులూ , ఈ రోజు మీకు ఎంతో ఇష్టమైన బుల్లి స్పైడర్ మ్యాన్ బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెల ఆధారంగా బొమ్మ గీయండి.



## నేను గీసిన బొమ్మ





- ఎస్. నాగలక్ష్మి, 10వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# బాధితురాలే నాయకురాలై ...

'నాకు పెళ్లయి అత్తగారి ఊళ్లో అడుగుపెట్టాను. ఆ రోజే గ్రామంలో ఉండే ఓ యువకుడు ఏదో అనారోగ్యంతో బాధపడుతూ హాస్టల్లో ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఆ తరువాత గ్రామస్తులంతా నేను వచ్చాకే ఆ యువకుడు మరణించాడని, నాపై మంత్రగత్తె ముద్ర వేశారు. నాతో ఎవరూ మాట్లాడేవారు కాదు. నాకు దూరంగా నడిచేవారు. ఎప్పుడైనా అనుకోకుండా తారసపడితే నా ముందే ఉమ్మి వేసేవారు. ఇటువంటి సంఘటనలు అనేకం ఎదురయ్యాయి. గ్రామస్తులంతా ఏకమై మానసికంగా, శారీరకంగా ఎంతో బాధపెట్టారు. చాలాసార్లు చనిపోదామనుకున్నాను కూడా. కాని నేను చేయని తప్పుకు శిక్ష ఎందుకు అనుభవించాలి? అనుకున్నాను' అంటున్న యువతి పేరు విశ్వాసి టోప్నో. జార్ఖండ్ ఖుంతి గ్రామ నివాసి.

2002లో ఆమెకు వివాహమై గ్రామానికి వచ్చింది. ఎన్నో ఆశలతో అత్తవారింట అడుగుపెట్టిన ఆ నవవధువుకు ఊహించని ఈ పరిణామం ఆమెను కుంగదీసింది. 'నలుగురిలోకి రావాలన్న భయం. ఎవరితోనైనా మాట్లాడాలంటే వణుకుపుట్టేది. గదిలో ఓ మూల కూర్చొని రాత్రి పగలు తేడా లేకుండా ఏడ్చేదాన్ని. నా బాధ తీర్చేవారెవరూ కనిపించలేదు' అంటున్న విశ్వాసి ఉంటున్న గ్రామానికి 'గ్రామీణుల ఆరోగ్యం, ఇతర సమస్యలపై పనిచేసేందుకు ఓ స్వచ్ఛందసంస్థ వచ్చింది. అది నిర్వహించే ఓ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు విశ్వాసి కూడా సభ్యురాలైంది. అయితే అందరిలోనూ ఎక్కువ చదువుకున్న విశ్వాసిని బృంద నాయకురాలిగా ఉండమని సంస్థ ప్రోత్సహించింది. ఆ అవకాశం తనపై పడిన నిందను రూపుమాపుకోవడానికంటే ముందు గ్రామస్తుల్లో నెలకొన్న అజ్ఞానాన్ని పార

దోలేందుకు ఉపయోగించుకుంది విశ్వాసి. 'ఈ సమాజంలో మంత్రగత్తెలెవరూ లేరు. ఆ విషయాన్ని నేను బలంగా నమ్మాను. అదే విషయాన్ని మా గ్రామస్తులు కూడా విశ్వసించేలా చేయాలనుకున్నాను' అంటూ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేది. కానీ నాయకురాలిగా ఉంటున్నప్పటికీ ఆమెపై వేధింపులు ఆగలేదు. అవన్నీ భరిస్తూనే తన పని చేసుకుపోయేది. ఇంతలో 2018లో మరో స్వచ్ఛంద సంస్థ గ్రామానికి వచ్చింది. ఆ సంస్థలో థియేటర్ అనుభవం, చిత్రకళ అభ్యసించింది. ఆ కళ ద్వారా మంత్రగత్తె ఆచారానికి స్వస్తి పలికేలా గ్రామస్తుల్లో అవగాహన కల్పించేందుకు నడుం బిగించింది. తను నేర్చుకున్న కళతో నాటకాలు, చిత్రాలు, సమావేశాలు, మంత్రగత్తె విధాన వ్యతిరేక నినాదాలతో గ్రామగ్రామాలు తిరిగింది. ఎంతోమంది బాధితులను కలుసుకునేది. వారితో తన బాధలను పంచుకుంటూ ఆత్మనూన్యతతో బాధపడుతున్న వారందరికీ ధైర్యం కల్పించేది. సాధారణ జీవితం జీవించేలా ప్రోత్సహించేది. తననే ఉదాహరణగా తీసుకోమని చెప్పేది. 'క్రమంగా వారిలో మార్పు రావడం గమనించాను. సిగ్గుతో, భయంతో బయటికి రావడానికే భయపడే వారంతా ఇప్పుడు వీధుల్లోకి వస్తున్నారు. వారి ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తోంది. వారే కాదు ఇప్పుడు ఇతర మహిళలు కూడా నన్ను అభిమానించడం మొదలుపెట్టారు. గ్రామస్తుల ప్రశంసలు వింటున్నప్పుడు పెద్ద అగ్నిపరీక్షను దాటాను అనిపించింది' అంటుంది విశ్వాసి.

నిందలు పడ్డాయని బాధపడుతూ కూర్చోకుండా వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని తన జీవితంతోపాటు తనలాంటి వారి బతుకుల బాగు కోసం పాటుపడుతున్న విశ్వాసి ఎంతోమందికి ఆదర్శం.






## రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

**మా చిరునామా**
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496



15 చుక్కలు 8 వచ్చే వరకు (మధ్య చుక్క)
జాస్తి భాగ్యలక్ష్మి,
జయపురం, బంటుమిల్లి,
కృష్ణాజిల్లా.



# ఆశించిన విజయాల్లేవ్..



**మొదటి త్రైమాసికం..**

జనవరిలో సంక్రాంతి కానుకగా నాగార్జున 'బంగార్రాజు' తప్ప పెద్ద హీరోల సినిమాలేవీ విడుదలవ్వలేదు. 'ఇందువదన', '1945', 'అతిథి దేవోభవ', 'రౌడీబాయ్స్', 'హీరో' వంటి చిన్న బడ్జెట్ సినిమాలు వచ్చినా పెద్దగా విజయం సాధించలేదు. ఫిబ్రవరి మొదటి వారం రవితేజ 'ఖిలాడి', చివరి వారం 'భీమ్లా నాయక్'తో పాటు ఓ అరడజను సినిమాలు వచ్చాయి. అవీ అంతంతమాత్రమే అలరించాయి. మార్చిలో భారీ బడ్జెట్, భారీ తారాగణంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా విడుదలైన 'రాధేశ్యామ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి ఊహించని పరిణామం ఎదురైంది. ఈ పరాజయం నటీనటులు, దర్శకులకే కాక, యావత్ చిత్రసీమను ఆలోచనలో పడేసింది. బడ్జెట్, తారాగణం కంటే కంటెంట్ ప్రాధాన్యత ఉండాలని మరోసారి రుజువైందని ఇండస్ట్రీ వర్గాలు చర్చించుకున్నాయి. మార్చి చివరి వారంలో విడుదలైన 'ఆర్ఆర్ ఆర్' చిత్ర విజయంతో ఇండస్ట్రీ ఆశలు మళ్లీ చిగురించాయి. మొదటి మూడునెలల గ్రాఫ్ ఇలా ఉంటే..

**ఆశించిన ఫలితాలు రాలేదు..**


ఏప్రిల్ చివరి వారంలో విడుదలైన 'ఆచార్య' చిత్రం భారీ పరాజయం మూటగట్టుకుని ఇండస్ట్రీని అయోమయంలో పడేసింది. మే నెలలో వచ్చిన 'సర్కారువారి పాట', ఎఫ్-3 చిత్రాలకు కూడా జనం నీరాజనాలు పట్టలేదు. దేశభక్తి ప్రధాన ఇతివృత్తంగా ఆర్మీ జవాను బయోపిక్‌గా తెరకెక్కిన 'మేజర్' చిత్రం విజయంతో కొంత ఊపిరిపీల్చుకున్న ఇండస్ట్రీకి నాని 'అంటే సుందరానికి', రానా, సాయిపల్లవి 'విరాటపర్వం' చిత్రాలు పెద్దగా ఉపశమనం కలిగించలేదు.

ఇలా ప్రతి మూడునెలలకోసారి దాదాపు 10 నుంచి 15 సినిమాలు విడుదలవుతూ వస్తున్నా ఆశించిన ఫలితాలు రాలేదు. జులై నుంచి సెప్టెంబరు వరకు చూస్తే.. రామ్ నటించిన 'ది వారియర్', రవితేజ 'రామారావు ఆన్ డ్యూటీ' మెప్పించలేదు. ఏడాదిలో అర్ధభాగం పూర్తవుతున్నా ఒక్క పెద్ద విజయం లేక ఇండస్ట్రీ వెలవెలబోయింది. ప్రేక్షకుల నాడి పట్టుకోవడంలో పెద్ద తలకాయలన్నీ మల్లగుల్లాలు పడ్డాయి. తీవ్ర ఒత్తిడితో ఉన్న ఇండస్ట్రీకి ఆగష్టులో వరుసగా విడుదలైన 'బింబిసార', 'సీతారామం', 'కార్తికేయ-2' చిత్రాల విజయాలు పెద్ద ఉపశమనంగా నిలిచాయి.

**కోవిడ్ సంక్షోభం తరువాత తేరుకున్న చిత్రసీమ నుంచి ఈ ఏడాది చిన్నాపెద్దా చిత్రాలు దాదాపు వందకు పైగా విడుదలయ్యాయి. వాటితోపాటు యాభైకి పైగా డబ్బింగ్ చిత్రాలు కూడా తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. షూటింగులు పూర్తిచేసుకున్న చిత్రాలు జనవరి నుంచే విడుదలవ్వడం మొదలైంది. అరకొరా చిత్రీకరణతో మధ్యలో ఆగిపోయిన సినిమాలన్నీ వేగంగా షూటింగులు జరుపుకుని అభిమానులను అలరించాయి. అయితే మొదటినుంచి గమనిస్తే ఆచితూచి అడుగులు వేశారనొచ్చు.**











పెద్ద తారాగణం లేకుండానే చిన్న హీరోలు, చిన్న బడ్జెట్‌లో వచ్చిన సినిమాలు విజయాన్ని అందుకున్నాయి. అయితే ఇంతటి విజయోత్సాహంతో ఉన్న ఇండస్ట్రీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కి భారీ అంచనాలు పెట్టుకున్న 'లైగర్' పరాజయం మింగుడుపడని విషయంగా మారింది. ఇక సెప్టెంబరులో దాదాపు పది చిత్రాలు విడుదలైనా ఒక్కటీ విజయం సాధించలేదు.

**ఆలోచించాలి..**

నాగార్జున 'ది ఘోస్ట్', చిరంజీవి 'గాడ్ ఫాదర్' చిత్రాలతో అక్టోబరు మాసం ప్రారంభం ప్రేక్షకులను అలరిస్తుందనుకున్నారు. కానీ సరైన కథాబలం లేక ఒకటి, మాతృకను తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా మార్పులు చేసి విడుదల చేశామని చెప్పిన మరొకచిత్రం బాక్సాఫీసు దగ్గర బోల్తాపడ్డాయి. చిన్న చిత్రంగా, సామాజిక వివక్షను ఎత్తిచూపుతూ ముందుకొచ్చిన 'అమ్ము' చిత్రానికి వచ్చిన ఆదరణ కంటెంట్ ఉన్న సినిమాలు ఎప్పుడూ ప్రేక్షకులను అలరిస్తాయనడానికి నిదర్శనంగా నిలిచింది. ఆ తరువాత వచ్చిన 'యశోద', 'మసూద', 'ఇట్లు మారేడుపల్లి ప్రజానీకం', 'హిట్ సెకండ్ కేస్'లలో 'హిట్', 'మసూద' చిత్రాలకే మంచి రివ్యూలు వచ్చాయి. ఇక రాబోయే 18 పేజెస్, ధమాకా చిత్రాలకు ఏమేరకు ఆదరణ లభిస్తుందో వేచి చూడాలి.

**అనువాదాలు..**

మొత్తంగా చూసుకుంటే ఈ ఏడాది ఇండస్ట్రీకి ఆశించిన ఫలితాలు రాలేదనొచ్చు. పైగా పెద్ద సినిమాలతో పోల్చితే చిన్న సినిమాలే ప్రేక్షకులను ఎక్కువగా అలరించాయి. డబ్బింగ్ చిత్రాలుగా కేజీఎఫ్-2, 'విక్రమ్', 'కాంతారా', 'బ్రహ్మాస్త్రం', 'చార్లీ 777', 'రాకెట్రీ', 'గార్గి', 'పొన్నియిన్ సెల్వన్1', 'ప్రిన్స్', 'రామ్ సేతు', 'సర్దార్', 'లవ్‌టుడే', 'మట్టి కుస్తీ', 'విజయానంద్' వంటి 50కు పైగా చిత్రాలు ప్రేక్షకులను పలకరించాయి. వీటిల్లో కూడా ఐదారు సినిమాలే ప్రేక్షకులను మెప్పించాయి.







విజయోత్సాహంలో అర్జెంటీనా జట్టు

# ఉత్కంఠభరితంగా ఫిఫా ఫైనల్

**దోహా :** ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ ఉత్కంఠభరితంగా సాగింది. అర్జెంటీనా, ఫ్రాన్స్ నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డాయి. తొలుత ఇరుజట్లు సమానంగా 2-2 స్కోర్ సాధించడంతో మ్యాచ్‌ను అదనపు సమయానికి పొడిగించారు . అదనపు సమయంలోనూ రెండు జట్లు 1-1 గోల్స్ చూసి మ్యాచ్‌ను 3-3తో సమం చేశాయి. దీంతో పెనాల్టీ షూటవుట్ అనివార్యమైంది. పెనాల్టీ షూట్‌వుట్ కూడా అత్యంత ఉత్కంఠ భరితంగా సాగింది. తొలుత ఫ్రాన్స్ ఆటగాడు ఎంబపే తొలిగోల్ సాధించి ఆ జట్టును ఆధిక్యంలో నిలిపాడు. ఆ తరువాత బంతిని అర్జెంటీనా కెప్టెన్ మెస్సీ గోల్ గా మలచడంతో రెండు జట్లు మళ్లీ సమానంగా నిలిచాయి. ఆ తరువాత ఫ్రాన్స్ ఆటగాళ్లు విఫలం కావడం రిజర్వు బెంచ్ నుండి వచ్చిన ఆటగాడు పౌలో డోబెల్లా గోల్ చేయడంతో అర్జెంటీనా జట్టు పెనాల్టీ షూటవుట్‌లో 2-1 ఆధిక్యానికి దూసుకెళ్లింది. ఆ తరువాత పెరడెస్ చేసిన గోల్‌తో 3-1 ఆధిక్యానికి అర్జెంటీనా జట్టు దూసుకెళ్లింది. ఈ దశలో ఫ్రాన్స్ ఆటగాడు కోలోమౌని గోల్ చేయడంతో ఇరుజట్లు 3-2తో నిలిచాయి. చివరి నిమిషంలో అర్జెంటీనా ఆటగాడు మోంటెల్ మరో గోల్ చేయడంతో ఆ జట్టు 4-2తో ఆ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. 1978, 1986లలో కూడా అర్జెంటీనా జట్టు ఫిఫా కప్పును గెలిచింది. తాజా గెలుపుతో 20 సంవత్సరాల తరువాత లాటిన్ అమెరికా దేశం ప్రపంచ కప్‌ను గెలుచుకుంది.

**తొలి నుండి పై చేయే ...**

మ్యాచ్ తొలిదశలో ఫ్రాన్స్‌పై అర్జెంటీనా పైచేయి సాధించింది. దూకుడుగా మెస్సీ మాయాజలమే చేశాడు. దీంతో ఫస్ట్ హాఫ్ సమయంలోనే అర్జెంటీనా జట్టు ప్రత్యర్థి జట్టు గోల్‌పోస్టుపై పదేపదే దాడులు చేసింది. తొలుత మెస్సీ, ఆ తరువాత ఆంజెల్ డీ మారియా గోల్స్ చేయడంతో అర్జెంటీనా జట్టు 2-0 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. దీంతో అర్జెంటీనా అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. అయితే, మ్యాచ్ రెండవ అర్ధభాగంలో ఫ్రాన్స్ యువ ఆటగాడు ఎంబపే వరుసగా రెండు గోల్స్ సాధించి, మ్యాచ్‌ను సమం చేశారు. దీంతో అదనపు సమయంలో ఆట సాగాల్సివచ్చింది.

## ఎంబపే హ్యాట్రిక్

### గోల్డెన్ బూట్ కైవశం

అర్జెంటీనాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ ఆటగాడు ఎంబపే హ్యాట్రిక్ గోల్స్‌తో అదరగొట్టాడు. ఫ్రాన్స్ చేసిన మూడు గోల్స్‌ను ఎంబపే సాధించడం విశేషం. ఆట 80, 81, 117 నిమిషాల్లో ఎంబపే గోల్స్ సాధించాడు. దీంతో అర్జెంటీనాకు ఫ్రాన్స్ గట్టి పోటీ ఇచ్చింది. ఎంబాపే పోరాటంతోనే మ్యాచ్ పెనాల్టీ షూటౌట్ వరకూ వెళ్లింది. 2018 ప్రపంచకప్‌లో గోల్ కొట్టి ఫ్రాన్స్‌ను విశ్వ విజేతగా నిలిపి ఎంబాపే ఈ ప్రపంచకప్‌లోనూ అదే రిపీట్ చేస్తాడని అందరూ ఆశించారు. అయితే తృటిలో ఇది మిస్సయింది. అయితే ఆదివారం మూడు గోల్స్‌తో ఈ ప్రపంచకప్‌లో మొత్తంగా ఎనిమిది గోల్స్ చేసిన ఎంబపే గోల్డెన్ బూట్ అందుకున్నాడు.

# రెండు రోజుల్లోనే...!

- సఫారీలపై ఆసీస్ గెలుపు
- గబ్బా పిచ్‌పై తీవ్ర విమర్శలు

**బ్రిస్బేన్ (ఆస్ట్రేలియా) :** పచ్చిక మైదానం తరహా గబ్బా పిచ్‌పై ఆతిథ్య ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలుపొందింది. టెస్టు క్రికెట్ ఆడేందుకు ఏమాత్రం సురక్షితం కాని బ్రిస్బేన్ పిచ్‌పై సఫారీ కెప్టెన్ డీన్ ఎల్గార్ అభ్యంతరం వ్యక్తం చేయగా.. కంగారూ సారథి పాట్ కమిన్స్ పిచ్ బాగానే ఉందంటూ వెనకేసుకొచ్చాడు. రెండు రోజుల్లోనే ముగిసిన సూపర్‌ఫాస్ట్ టెస్టులో తొలుత దక్షిణాఫ్రికా 152 పరుగులకే ఆలౌటైంది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 218 పరుగులు చేసి విలువైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 99 పరుగులకు కుప్పకూలింది. 34 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. బ్యాటింగ్‌కు నరకప్రాయమైన పిచ్‌పై ఆసీస్ బ్యాటర్ ట్రావిశ్ హెడ్ (92) విలువైన ఇన్నింగ్స్‌తో ఆతిథ్య జట్టును విజయ పథంలో నడిపించాడు. రెండు రోజుల్లో ముగిసిన టెస్టులో ట్రావిశ్ హెడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మూడు మ్యాచుల టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా రెండో టెస్టు (బాక్సింగ్ డే) డిసెంబర్ 26న మెల్‌బోర్న్‌లో ఆరంభం కానుంది.

**వీరూ కౌంటర్ :** సఫారీలతో ఆసీస్ తొలి టెస్టుకు గబ్బా పిచ్‌పై వీరెందర్ సెహ్వాగ్ పదునైన విమర్శ చేశాడు. ట్విట్టర్ వేదికగా క్రికెట్ ఆస్ట్రేలియా, పాశ్చాత్య మీడియాకు చెంపపెట్టు సమాధానం ఇచ్చాడు. '142 ఓవర్లు, కనీసం రెండు రోజులైనా పూర్తిగా ఆడలేదు. వీళ్ల మనకు ఎటువంటి పిచ్‌లు తయారు చేయాలనే అంశంపై పాఠాలు చెబుతారు. ఇదే భారత్‌లో జరిగి ఉంటే, టెస్టు క్రికెట్ అంతానికి ఇది నాంది అని ముద్ర వేసేవాళ్లు. టెస్టు క్రికెట్‌ను నాశనం చేస్తున్నారు. వీరి అధికులమనే భావన ద్రిగ్భాంతికరం' అని వీరెందర్ సెహ్వాగ్ ట్విట్టర్ వేదికగా చురకలు అంటించాడు.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68